ప్రజాశక్తి

ఆదివారం 11 ఆగస్టు 2024

8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా







సైబర్ నేరాలపై ఫిర్యాదులకు రూపొందించిన యాప్‌ను ప్రారంభిస్తున్న హోంమంత్రి వి.అనిత, చిత్రంలో సిపి రాజశేఖరబాబు, కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎంఎల్ఏలు గద్దె, బొండా తదితరులు

సైబర్ నేరాల నివారణపై వాక్‌థాన్

యాప్‌ను ప్రారంభించిన హోం మంత్రి అనిత

ప్రజాశక్తి - విజయవాడ, విజయవాడ అర్బన్ : సైబర్ నేరాల నివారణపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యాన శనివారం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుండి బెంజిసర్కిల్ వరకు 2,500 మందితో వాక్‌థాన్ నిర్వహించారు. అనంతరం బెంజిసర్కిల్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా హోం మంత్రి వి.అనిత హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి 16 రకాల సైబర్ మోసాలపై అవగాహన, ఫిర్యాదుల కోసం రూపొందించిన యాప్‌ను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, సైబర్ ద్వారా జరిగే నేరాల గురించి అవగాహన కల్పించడం ద్వారా సమాజంలో వివిధ రకాల సైబర్ నేరాలు జరగకుండా అడ్డుకట్ట వేసే లక్ష్యంతో ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు పర్యవేక్షణలో డిసిపి గౌతమి షాలి ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ ఎసిపి తేజేశ్వరరావు తమ సిబ్బంది సహకారంతో బృహత్తర ప్రణాళిక రూపొందించారు. ప్రజలందరినీ సైబర్ సిటిజన్లుగా తయారు చేయాలనే ఉద్దేశంతో దీనికి రూపకల్పన చేశారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని మంత్రి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపి రాజశేఖర బాబు మాట్లాడుతూ రోజుకు 5 నుంచి 6 సైబర్ నేరాల ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. విద్యార్థులు, వైద్యులు చివరికి ఐఎఎస్‌లు, ఐపిఎస్‌లు.. ఇలా చాలామంది మోసపోతున్నారని చెప్పారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930కు ఫోన్ చేయాలన్నారు. దీంతో జాతీయ స్థాయిలో సైబర్ క్రైమ్ పోర్టల్ మోసగాళ్ల ఆర్థిక లావాదేవీలను నిలిపివేస్తుందన్నారు. 1930 పోర్టల్‌కు 98 బ్యాంకులతో అనుసంధానం ఉందని చెప్పారు. జిల్లా పోలీస్ కమీషనరేట్ పరిధిలో ప్రజలలో చైతన్యం (మిగతా 2లో)

హడావుడి జాస్తి...కొనుగోళ్లు నాస్తి...

- రాజధానిలో పెరిగిన భూముల ధరలు
- విక్రయాలకు స్థానికేతరుల మొగ్గు
- జంగిల్ క్లియరెన్సు పనులతో హడావుడి



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని గ్రామాల్లో మళ్లీ రియల్టర్ల రాకపోకలు పెరిగాయి. కొనుగోలు దారులు వస్తున్నారు... వెళ్తున్నారు... ధరలు తెలుసుకుంటున్నారు. కానీ కొనుగోళ్లు జరగడం లేదు. రిజిస్ట్రేషన్ల వరకు వెళ్లడం లేదు. ప్రభుత్వం మారిన తరువాత రాజధానికి పూర్వవైభవం వస్తుందని భావిస్తున్నా ఇంకా పూర్తి స్థాయిలో నమ్మకం కలగడం లేదని, అంతేగాక ధరలు భారీగా పెంచడం వల్ల ఆశించిన స్థాయిలో లావాదేవీలు జరగడం లేదని రియల్టర్లు చెబుతున్నారు. బ్లాక్ మనీ ఉన్న వారు కొద్ది మంది, ఆదాయం పన్ను నుంచి మినహాయింపు పొందాలనుకునే వారు. రాజధానిలో మాకు ఒక ప్లాటు వుందని భావించి కొనుగోలుకు ఆసక్తి చూపేవారు ఆడపాదడపా వస్తున్నారు. కానీ రైతులు ప్లాట్లు విక్రయాలకు ఆసక్తి చూపిస్తున్నా వారు ఆశిస్తున్న ధరలకు బేరాలు జరగడం లేదు. ప్రస్తుతం రాజధాని గ్రామాల్లో జంగిల్ క్లియరెన్సు పనులు జరుగుతున్నాయి. వివిధ దశలోఉన్న బహుళ అంతస్తులు నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాజధాని జనసంద్రాత పెంచడానికి వ్యూహరచన చేస్తున్నారు. అయితే ఇవ్వనీ కార్యరూపం దాల్చడానికి ఇంకా కనీసం ఆరు నెలల వరకు వేచిచూడాల్సి వస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం భూములు ధరలు భారీగా పెరిగాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారుతుందని, అమరావతికి పూర్వవైభవం వస్తుందని ముందే ఊహించిన కొంత మంది రియల్టర్లు ఆరు నెలల క్రితమే ఈ ప్రాంతంలో భూములు కొనుగోలుకు శ్రీకారం చుట్టారు. గతంలో తక్కువ ధరలకు కొనుగోలు చేసిన వారు ఇప్పుడు రెట్టింపు ధరలకు విక్రయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. విక్రయించుకోవాలని అనుకుంటున్న వారిలో వాస్తవ రైతులు తక్కువ మందే ఉంటున్నారు. రైతులు కాని వారు ఇతర ప్రాంతాల నుంచి వెళ్లి కొనుగోలు చేసిన వారు ప్రస్తుతం ఉన్న సానుకూల వాతావరణాన్ని సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. మెట్ట ప్రాంతంలో గతేడాది భూముల ధరలు గజం రూ.20 నుంచి 25 వేలు వరకు ఉండగా ఇప్పుడు రూ.35 నుంచి రూ.40 వేలు వరకు చెబుతున్నారు. అలాగే జరీబు (మాగాణి) గ్రామాల్లో గత ఏడాది గజం రూ.30 వేల నుంచి రూ.35 వేలు ఉండగా ఇప్పుడు ఏకంగా రూ.50 వేలనుంచి రూ.60వేలకు పైగా చెబుతున్నారు. గత నెలలో కొంత మంది గజం రూ.52 వేల నుంచి రూ.56 వేల మధ్య ఒకటి రెండు రిజిస్ట్రేషన్లు జరగడంతో ఇదే ధరలు ప్రస్తుతం కొనసాగిస్తున్నారు. రాజధాని గ్రామాల్లో 2015లో అప్పటి టిడిపి ప్రభుత్వం భూసమీకరణ ద్వారా రైతుల నుంచి 34,772 ఎకరాలను తీసుకుంది. భూములు ఇచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన రిటర్నబుల్ ప్లాట్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు సిఆర్‌డిఎ చట్టంలో మూడేళ్లలో రిటర్నబుల్‌ప్లాట్లు ఇస్తామని పేర్కొన్నారు. 2018లో ప్లాట్లు కేటాయించినా అభివృద్ధి పనులు ప్రారంభం అయ్యేలోగా రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చింది. పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ఆ తరువాత 2019 డిసెంబరు 17న అమరావతి రాజధాని స్థానంలో మూడు రాజధానులు ఏర్పాటు చేస్తున్నట్టు అప్పటి సిఎం జగన్ ప్రకటించారు. దీంతో అమరావతిలో సంక్షోభం ఏర్పడింది. మొత్తం క్రయ విక్రయాలు మందగించాయి. రెండునెలల క్రితం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మళ్లీ అమరావతికి కొత్త కళ సంతరించుకుంటుందని భావించి పలువురు రియల్టర్లు, ధనికులు, వ్యాపార వేత్తలు రాజధానికి వచ్చి భూముల పరిస్థితిని తెలుసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. మొత్తం 54 వేల ప్లాట్లు రైతులకు రిటర్నబుల్‌గా అప్పగించారు. వీటిల్లో 2019 వరకు రైతుల నుంచి కొనుగోలు చేసిన స్థానికేతరులు వీటిని విక్రయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. రాజధాని గ్రామాల్లోనే కాకుండా పరిసర మండలాల్లో కూడా గత రెండునెలల కాలంలో భూముల ధరలు భారీగా పెరిగాయి.

సంపద కేంద్రాలకు మోక్షం లభించేనా ?

- అక్టోబర్ నాటికి అందుబాటులోకి తెస్తామన్న ప్రభుత్వం
- క్లాప్ మిత్రాల కొరత, షెడ్ల వద్ద మౌలిక వసతుల లేమి
- పంచాయతీలకు గుదిబండగా మారతాయని ఆందోళన



ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

'గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగుపరుస్తాం. సంపద కేంద్రాలను ఏర్పాటు చేశాం. గ్రామ పంచాయతీల్లో నూ ఇంటింటికీ వెళ్లి క్లాప్ మిత్రాలు చెత్త సేకరిస్తాం' అని గతంలో ప్రభుత్వాలు చెప్పిన మాటలు నీటి మూటలుగా మారాయి. సందప కేంద్రాలకుగాను గ్రామ పంచాయతీల్లో నిర్మించిన షెడ్లు దశాబ్దకాలంగా అక్కరకు రాలేదు. పారిశుధ్యం మెరుగుపడలేదు. క్షేత్రస్థాయిలో పలు సమస్యలతో అక్కరకు రాని ఈ సంపద కేంద్రాలను ఈ ఏడాది అక్టోబర్ నాటికి అన్ని గ్రామాల్లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని నూతన ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా 50 రోజుల్లో సంపద కేంద్రాలు ఏ మేరకు అందుబాటులోకి వస్తాయనేదానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. స్వచ్ఛ కార్పొరేషన్ నిధులు నిలిచిపోవడంతో పంచాయతీలకు ఈ కేంద్రాలు గుదిబండగా మారతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

కృష్ణాజిల్లాలో 497 గ్రామ పంచాయతీల్లో 3 లక్షల 44 వేల 33 గృహాల నుంచి చెత్త సేకరణకు ప్రభుత్వం మ్యాపింగ్ చేసింది. చెత్త సేకరణలో క్లాప్ మిత్రాలు కీలకం. 250 గృహాలకు ఒకరు చొప్పున 1377 మంది క్లాప్ మిత్రాలను నియమించాలి. ఇప్పటికి అధికారికంగా 1,180 మంది ఉన్నట్లు చూపుతున్నారు. మరో 190 మందిని నియమించాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో నిర్వహించడానికి పంచాయతీలు టెండర్ పద్ధతిలో పిలిచే పారిశుధ్య కార్మికులకు అదనంగా క్లాప్ మిత్రాలను నియమించాలి. అయితే చాలా పంచాయతీల్లో టెండర్ పద్ధతిలో విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులనే క్లాప్ మిత్రాలుగా చూపుతున్నారు. గతంలో క్లాప్ మిత్రాలకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా నెలకు ఆరు వేల రూపాయలు అందించారు. గత కొన్ని నెలులుగా పంచాయతీలకు ఈ నిధులను కార్పొరేషన్ నిలిపివేసింది. దీంతో వీధి దీపాల మార్చడానికే నిధులు లేక అవస్థలు పడుతున్న పంచాయతీలకు ఈ షెడ్ల నిర్వహణ, చెత్త సేకరణ భారంగా మారుతుందని (మిగతా 2లో)



జాబ్ మేళాకు భారీగా హాజరైన నిరుద్యోగ యువతీ యువకులు

నిరుద్యోగ సైన్యానికి అద్దంపట్టిన జాబ్‌మేళా

ఏడు వేల మందికిపైగా హాజరు

ప్రజాశక్తి - భవానీపురం : దేశంలో, రాష్ట్రంలో చదువుకున్న యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు లేక వారి భవిష్యత్ అంధకారమవుతోంది. లక్షలు ఖర్చుపెట్టి ఉన్నత చదువులు చదివించినా సరైన ఉపాధి అవకాశాలు రాకపోవటంతో యువత భవిష్యత్ నిర్వీర్యమవుతోంది. చదువుకున్న చదువుకు అర్హత తగ్గ ఉద్యోగం రాకపోవటంతో రాజీపడి ఏదోఒక సంస్థలో ఉద్యోగం చేయాల్సిన దుర్భర పరిస్థితి నేటి యువతీ యువకులకు నెలకొంది. తల్లిదండ్రులకు భారం కాకూడదని యువతీ యవకులు తమ స్వస్థలంలో (మిగతా 2లో)



చిన్ననాటి నుంచే ఆట-పాటల్లో రాణించాలి

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి-విజయవాడ : ఆట-పాటల్లో చిన్నారులు రాణించడానికి చిన్ననాటి నుంచే మంచి శిక్షణ అలవరుచుకోవాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. కమిషనర్ శనివారం తన పర్యటనలో భాగంగా సర్కిల్ 3 పరిధిలో ఉన్న గురునానక్ కాలనీ లోని ఫన్ టైమ్స్ క్లబ్, పటమట లోని ఖన్నా నగర్, ప్రాంతాలు పర్యటించి క్షేత్రస్థాయిలో శానిటేషన్, దాని నిర్వహణను పరిశీలించారు. ముందుగా ఫన్ టైంస్ క్లబ్ పర్యటించిన కమిషనర్ అక్కడున్న చిన్నారులతో సంభాషించి, వారు ఆడుతున్న ఆటలను పరిశీలించారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని చిన్నారులను కోరారు. అక్కడున్న వారితో మాట్లాడి వాళ్ల సమస్యలను కమిషనర్ అడిగి తెలుసుకొని, వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పటమటలోని ఖన్నా నగర్ ప్రాంతం పర్యటించి, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని పారిశుధ్య సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఖాళీ ప్రదేశాల యజమానులు తమ తమ ప్రదేశాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వర్షపు నీటి నిలువలు, దోమలు లేకుండా చూసుకోవాలని ఆయన అన్నారు.ఈ పర్యటనలో సర్కిల్ 3 జోనల్ కమిషనర్ శివరామకష్ణ, డిప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ చీరన్ రాయ్, ప్రజారోగ్య విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు



గ్రామ, వార్డు సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల సమావేశం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎపిఎన్‌జిఓస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో శనివారం గ్రామ వార్డు సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన అసోసియేషన్ పశ్చిమ కష్ణా జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ దివ్యాంగ ఉద్యోగులకు కన్వేయన్స్ అలవెన్సు పెంపుదలకు కృషి చేస్తామన్నారు. ఉద్యోగులు కోరిన విధంగా సంక్షేమ నిధి గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.జాని పాషా మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల హక్కులను 2016 చట్ట ప్రకారం పరిరక్షించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు పి.అశ్వర్థ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.కాశీ విశ్వనాధ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు, అదనపు కార్యదర్శి ప్రేమ్ సుధాకర్ గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రోజా ప్రకాష్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యస్.కె.సుభాని, యన్.రాజేష్ బాబు పాల్గొన్నారు.



అటల్ టింకరింగ్ ల్యాబ్ వర్క్‌షాప్ ప్రారంభం

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్లో శనివారం జిల్లాస్థాయిలో మెంటర్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ వర్క్ షాపును జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ ప్రారంభించి మాట్లాడుతూ జిల్లాను ప్రతిష్టాత్మక స్థానంలో నిలపాలని, సమస్యల పరిష్కారానికి ఉపయోగపడే సులువైన తక్కువ ఖర్చుతో తయారయ్యే పరికరాలను తయారు చేయాలని సూచించారు. దేశ వ్యాప్తంగా అటల్ మార్గాల్లో ఈ ఏడాది ఎన్టీఆర్ జిల్లా తరఫున ఏడు జాతీయ స్థాయి ప్రాజెక్టులు ఎన్నికైనందుకు విద్యార్థులను అభినందించారు. జ్యోతిర్మయి, సోని, జగదీష్, ఇమ్మానుయేల్, శాంతారాం, వెంకటేష్, రాజీవ్ స్టార్టప్ కంపెనీ అయిన ఫైనల్ ఎవేంజర్స్ అకాడమీ, రోబోటిక్స్ ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు.

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం అవాస్తవం : సిపి

ప్రజాశక్తి - విజయవాడ : ఈనెల 8 వ తేదీ రాత్రి విజయవాడ బందర్ రోడ్డులో వున్న అంబేద్కర్ విగ్రహం ముందు లిఖించబడిన 'బాబా సాహెబ్ డా.బి.ఆర్. అంబేద్కర్ గారి సామాజిక న్యాయ మహా శిల్పం – ఆవిష్కరణ కర్త శ్రీ వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి గారు, ముఖ్యమంత్రి వర్యులు తేదీ 19-01-2024" అనే అక్షరాలలో 'శ్రీ వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి గారు, ముఖ్యమంత్రి" అక్షరాలను కొందరు వ్యక్తులు తొలగించారనిని ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు తెలిపారు. పోలీసులకు సమాచారం వచ్చిన వెంటనే అంబేద్కర్ విగ్రహం సందర్శించి విచారణ చేపట్టామని పేర్కొన్నారు. అయితే కొన్ని పత్రికలు, సామాజిక మాధ్యమాలు దీనిని వక్రీకరించి కొందరు వ్యక్తులు విగ్రహ ధ్వంసానికి పాల్పడినట్లు, డా.బి.ఆర్. అంబేద్కర్‌ను అవమానించినట్లు దుష్ప్రచారం చేస్తూ కొన్ని సామాజిక వర్గాలను, దళిత సంఘాలను రెచ్చగొడుతూ వర్గాల మధ్య వైషమ్యాలు సష్టిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దళిత సంఘాలు ఇటువంటి వక్రీకరించబడిన సమాచారాన్ని, అబద్ధపు ప్రచారాన్ని నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

వృద్ధురాలిని గాయపరిచి గొలుసు దొంగిలించిన మహిళ అరెస్టు

ప్రజాశక్తి - విజయవాడ : వద్ధురాలిని గాయపరిచి మెడలోని బంగారపు చైన్ లాక్కొని వెళ్ళిన నిందితురాలిని పోలీసులు అరెస్టు చేశారు. సంఘటన జరిగిన కొద్ది గంటలలోనే నిందితురాలిని అరెస్ట్ చేయగలిగారు. పోలీసుల కథనం ప్రకారం...కష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్చ్ రోడ్డు తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్న ఫిర్యాది ఈనెల 9వ తేదీ తెల్లవారు జామున వద్ధురాలు అయిన తనతల్లిని ఇంటిలో ఒంటరిగా ఉంచి బయటకు వెళ్లాడు. ఉదయం 06.30 గంటల సమయంలో ఎవరో గుర్తు తెలియని మహిళ వచ్చి ఆ వద్ధురాలి గొంతుపట్టుకుని నొక్కుతూ మెడలో ఉన్న బంగారపు చైన్ లాక్కొని వెళ్లిపోయింది. ఈ ఘటనపై విచారించి తగు చర్య తీసుకోవాలని ఇచ్చిన ఫిర్యాదుపై కష్ణలంక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిమిత్తం సిసిఎస్‌కు అప్పగించారు. దీంతో సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వి.వి.లక్ష్మీనారాయణ, కష్ణలంక ఇన్‌స్పెక్టర్ ఎం.వి.ఎస్.నాగరాజు తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నేరం జరిగిన విధానం, అక్కడ ఉన్న సాంకేతిక ఆధారాలను సేకరించి అనుమానితులపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఓ మహిళ కదలికలు అనుమానంగా ఉండటంతో అదేరోజు సాయంత్రం పండిట్ నెహ్రూ బస్టాండ్ అవుట్ గేటు సమీపంలో అదుపులోకి తీసుకుని విచారించి అరెస్టు చేశారు. నిందితురాలు విజయవాడ పూర్ణానంద పేటకు చెందిన గుట్ల మానసవీణ అలియాస్ మానసగా గుర్తించారు. ఆమె వద్ద నుండి సుమారు లక్ష రూపాయల విలువైన 15 గ్రాముల బంగారపు చైన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకన్నారు.

శబ్ధ కాలుష్యం చేసే సైలెన్సర్లపై బైక్ మెకానిక్‌లు, డిస్ట్రిబ్యూటర్లకు హెచ్చరికలు

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని బైక్ మెకానిక్‌లు, డిస్ట్రిబ్యుటర్లతో శనివారం ట్రాఫిక్ ఎడిసిపి డి.ప్రసాద్ సమావేశం నిర్వహించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని నిర్వహించిన ఈ సమావేశంలో రహదారి భద్రతా నియమాలు, ఎంవి యాక్ట్‌లపై అవగాహన కల్పించారు. కంపెనీ అమర్చిన సైలెన్సర్ తప్ప, వాహనదారుడు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసినవిగానీ, ఇతర రాష్ట్రాల నుండి కొనుగోలు చేసినవిగానీ శబ్ధ కాలుష్యం కలిగిసేత వాటిని బిగించొద్దని సూచించారు. సైలెన్సర్ల మార్చుమని వాహనదారులు ఒత్తిడి చేస్తే పోలీసలకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మొదటిపేజీ తరువాయి



జాబ్‌మేళాలో ఉద్యోగం పొందిన యువతికి నియామక పత్రం అందిస్తున్న ఎంఎల్ఎ సుజనా చౌదరి

నిరుద్యోగ సైన్యానికి అద్దంపట్టిన జాబ్‌మేళా

ఉపాధి అవకాశాలు లేక పక్క దూర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. కుటుంబాన్ని వదిలి వెళ్ళలేని యువకులు చదువుకు తగ్గ ఉపాధి లేక చిన్నపాటి ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కోటి ఉద్యోగాలు భర్తీ చేస్తామని కేంద్రంలోని బిజెపి తమ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. కానీ కోటి ఉద్యోగాల మాట దేవుడెరుగు...ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను, కంపెనీలను ప్రైవేటుపరం చేస్తోంది. దీంతో ఉద్యోగాలు దొరక్క కోట్లాది మంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు నిరుద్యోగాన్ని మరింతగా పెంచేదిగా ఉంటున్నాయి. ఉన్న కొద్దిపాటి ఉద్యోగాలకు కూడా పోటీ తీవ్రంగా ఉంటోంది. ఒక్క ఉద్యోగానికి వేల మంది పోటీపడే దుస్థితి ఏర్పడుతోంది. దీనికి శనివారం భవానీపురంలోని ఎన్‌డిఎ కార్యాలయంలో నిర్వహించిన జాబ్‌మేళాయే నిదర్శనం. పశ్చిమ ఎంఎల్ఎ సుజనా చౌదరి ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ఈ జాబ్ మేళాకు 3 వేల మంది వస్తారని అంచనా వేయగా, 7 వేల మంది వచ్చినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. దీనిని బట్టి చూస్తే యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారనేది స్పష్టమవుతోంది. సుజనా ఫౌండేషన్, నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మెగా జాబ్ మేళాలో టెక్ మహీంద్రా, రిలయన్స్, అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్, ఐసిఐసిఐ బ్యాంక్, వరుణ్ మోటార్స్‌తోపాటు మొత్తం 40 కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో మొదటి విడతగా 1680 నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. మరో 2400 మందికి రెండో జాబితాలో ఎంపిక చేస్తామని సుజనా ఫౌండేషన్ సిఇఓ పి.వి.రావు, కో-ఆర్డినేటర్ వీరమాచినేని కిరణ్ తెలిపారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం : ఎంఎల్ఏ సుజనా చౌదరి

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కషి చేస్తున్నామని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) అన్నారు. సుజనా ఫౌండేషన్, నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్, సంయుక్త ఆధ్వర్యంలో శనివారం భవానీపురంలోని ఎన్డీయే కార్యాలయంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా పలువురికి ఉద్యోగాలు కల్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా కషి చేస్తున్నామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగాలకు సంబంధించిన ఉత్తర్వు కాపీలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ అడ్మినిస్ట్రేషన్ ఇంచార్జ్ చింతపల్లి అజయ్, మోహన్ వంశీ, ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, పైలా సోమి నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి ఎంఎస్ బేగ్, జనసేన నాయకులు బాడిత శంకర్, యేదుపాటి రామయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాల నివారణపై వాక్‌థాన్

తీసుకు వచ్చేందుకు వినూత్న పద్ధతిలో 200 మంది సైబర్ కమాండోలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కళాశాలల విద్యార్థినీ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించి వారిలో ఆసక్తి కలిగిన 2 వేల మందిని సైబర్ సోల్జర్లుగా తీసుకున్నామని తెలిపారు. మూడు నెలల్లో మూడు లక్షల మంది సైబర్ సోల్జర్లను తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. వీరంతా తమ తమ ప్రాంతాల్లోని ప్రజలకు సైబర్ నేరాలు ఏవిధంగా జరుగుతాయి, వాటికి గురికాకుండా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, నేరం జరిగిన పక్షంలో ఏ విధంగా 1930 కు ఫిర్యాదు చెయ్యాలనే విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ మారుతున్న అవసరాల ఆధారంగా జీవితంలో ఎన్నో మార్పులు వస్తుంటాయని, అలాగే పోలిసింగ్లోనూ మార్పులు వస్తున్నాయని చెప్పారు. జీవితంతో సాంతికేక పరిజ్ఞానం విడదీయరాన్ని సంబంధాన్ని కలిగి ఉందన్నారు. సులభతరమవుతున్న సాంకేతిక పరిజ్ఞానం అంతే నష్టాలను తెచ్చిపెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ నేరాల నివారణకు పోలీసు శాఖ చేసిన ఆలోచన అభినందనీయమన్నారు. విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ మాట్లాడుతూ కొత్తగా వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని కొంతమంది దుర్వినియోగం చేస్తున్నారని చెప్పారు. విజయవాడ తూర్పు ఎంఎల్ఎ గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టాలన్నారు. ఎంఎల్ఎ బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పోలీసు శాఖ తీసుకున్న చర్యల వల్ల సైబర్ నేరాలను చాలా వరకు నియంత్రించ వచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపిలు గౌతమి షాలి, ఎ.బి.టి.ఎస్.ఉదయరాణి, టి.హరికష్ణ, కె.చక్రవర్తి, ఎడిసిపిలు, ఎసిపిలు పాల్గొన్నారు.

సందప కేంద్రాలకు మోక్షం లభించేనా?

ఆందోళన వ్యక్తమవుతోంది.

షెడ్లలో వసతులు ఎలా?


జిల్లాలో 482 గ్రామాల్లో షెడ్ల నిర్మాణం పూర్తయింది. మరో 15 గ్రామాల్లో షెడ్లు నిర్మించాల్సి ఉంది. అయితే సేకరించిన చెత్తను ఎరువుగా మార్చడానికి అవసరమైన సౌకర్యాలు పూర్తి స్థాయిలో సమకూరలేదు. సేకరించిన చెత్తను ప్రాథమిక దశలో నిల్వ ఉంచడానికి మరో 1,963 తొట్టెలు నిర్మించాలి. 322 షెడ్లకు కరెంటు సౌకర్యం లేదు. వానపాముల ఎరువుల తయారీకి షెడ్లకు నీటి వసతి అవసరం. 251 షెడ్లకు నీటి కనెక్షన్లు లేవు. 73 షెడ్లకు రోడ్డు వసతి లేదు. ఈ మౌలిక వసతులు సమకూరితేనే పూర్తి స్థాయిలో సంపద తయారీ కేంద్రాలు ఉపయోగంలోకి వచ్చే పరిస్థితి ఉంటుంది.

సీతారావమ్మ మృతి సాహితీరంగానికి తీరనిలోటు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : గత 40 సంవత్స రాలుగా మచిలీపట్నంలో సాహిత్య రంగంలో పేరు గడిచిన ముదిగొండ సీతారావమ్మ మరణం సాహిత్య రంగానికి తీరని లోటు అని అమరావతి సాహితీమిత్రులు సంస్థ అధ్యక్షులు రావి రంగారావు అన్నారు. శనివారం దివంగత ప్రముఖ కవయిత్రి ముదిగొండ సీతారావమ్మ సంతాపసభ మచిలీపట్నం వివేకానంద మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా రావి రంగారావు మాట్లాడుతూ ముదిగొండ సీతారావమ్మ పది సంవత్స రాలు సాహితీ మిత్రుల సంస్థకు కోశాధికారిగా సేవలందించారని, ఆమె తన రచనలలో బాల్యంలో సమాజానికి ఉపయోగపడే విషయాలు పై చేసిన కవితలు చైతన్యవంతం చేసినట్లు తెలియజేశారు. మధురకవి ముదిగొండ నాగ మల్లికార్జునరావు భార్యాగా మహిళల సమస్యలపై గళమెత్తిన సీతారావమ్మ మరణం సాహిత్య రంగానికి చీకటి రోజు అని రావి రంగారావు అన్నారు .సభకు అధ్యక్షత వహించిన మచిలీపట్నం సాహితీ మిత్రులు సంస్థ అధ్యక్షులు న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ గత తరానికి నేటి తరానికి మధ్య తన రచనలతో అనుసంధానం చేస్తు మహెూన్నత కవితలు అందించినవారు ముదిగొండ అని అన్నారు . శతవధానం అష్టావధానంలలో ముదిగొండ తనకంటూ ఒక ప్రత్యేకతను ఏర్పరచుకున్నారన్నారు. గుడివాడ సాహితి మిత్రులు సంస్థ అధ్యక్షులు, ప్రముఖ కవి వసుదా బసవేశ్వర మాట్లాడుతూ కష్ణాజిల్లా సాహిత్య రంగంలో ముదిగొండ తనకంటూ ఒక పేజీని ఏర్పాటు చేసుకున్నరన్నారు. ఆమె రాసిన కవితలు చదివి వినిపించారు. మచిలీపట్నం సాహితి మిత్రులు ఆధ్వ ర్యంలో ఆమెకుకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్ర మంలో ప్రముఖ రచయిత్రి వారణాసి సూర్యకుమారి., భారతీయ సాహితీ పరిషత్ అధ్యక్షులు కారుమూరి రాజేంద్రప్రసాద్, బావ తరంగణి ఎడిటర్ భవిష్య, ప్రముఖ కవులు మేడిశెట్టి యోగానంద రావు ,అప్పినీడి పోతురాజు, రత్నకుమారి ,ముదిగొండ కాత్యాయని పాల్గొన్నారు.



ముదిగొండ సీతారావమ్మ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం



అర్హులైన కళాకారులకు పింఛన్లు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : అర్హులైన కళాకా రులకు పెన్షన్లు ఇళ్ల స్థలాలు వెంటనే మంజూరు చేయాలని శ్రీ దుర్గా మల్లేశ్వరి కళాపీఠం అధ్యక్షులు గాంధీ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం సాయంత్రం దుర్గామల్లేశ్వరి కళా పీఠం వార్షికోత్సవం స్థానిక సుబ్బరాయుడు శాస్త్రి (బెల్) ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు ఈ సభలో గాంధీ మాట్లాడుతూ కళాకారుల సంక్షేమానికి కషి చేయాలని కోరారు. జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు, భావ తరంగిణి సంపాదకులు భవిష్య అధ్యక్షత వహించిన సభలో పైడిపాటి రాందేవ్ వైఎస్ఆర్ మూర్తి నెరుసుచింతయ్య ,దర్శక రమేష్ పుప్పాల వీరాంజనేయులు ,ఏడుకొండలు సూరిబాబు మోహన్ రెడ్డి కొడాలి రాజా విన్నకోట సత్యనారాయణ, లంకిశెట్టి బాలాజి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా సీనియర్ నటీమణులు మట్టా విజయలక్ష్మి , గొట్టపు శివకుమారి, గంధం రాజేశ్వరి, వంగ మేడ విజయ, సీతాకుమారి, సిలార్ బి పద్మ లను అలాగే టీవీ రేడియో ఆర్టిస్టులు అమ్ముల పార్వతి అమ్ముల సువర్ణ,డి కమల కుమారి, సాయి కుమారి ,బి నాగలక్ష్మి ,వరలక్ష్మిలను కళా పీఠం ఘనంగా సత్కరించారు.

ఉయ్యూరు లయన్స్ క్లబ్‌కు అవార్డులు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు లయన్స్ క్లబ్ 2023- 2024 సంవత్సరంలో చేసిన పలు సేవాకార్యక్రమాలకు 9 అవార్డులతో పాటు ఉత్తమ అధ్యకుడు అవార్డు సాధించి లయన్స్ జిల్లా స్థాయిలో అత్యధిక అవార్డులు సొంతంచేసుకుని అత్యుత్తమ క్లబ్ నిలిచింది. పోరంకిలో శనివారం శ్రీకష్ణవేణి విద్యాసంస్థల ఆవరణలో లయన్స్ జిల్లా క్యాబినేట్ గవర్నర్ జెఎన్ శం కర్ గుప్తా అధ్యతన జరిగిన కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్, మాజీ ఎమ్మెల్సీ చిగురుపాటి వరప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని అవార్డులు అందజేశారు. 2023- 2024 సంవత్సరానికి క్లబ్ అధ్యక్షునిగా ఎండి ఇస్మాయిల్ జిల్లాలో ప్రతిష్టాత్మకమైన 5 ప్రత్యేక అవార్డులు, మరో నాలుగు వివిధ రకాల అవార్డులు క్లబ్కు లభించాయి. మహదేవ్ బెస్ట్ ఇన్నోవేటివ్ క్లబ్, మహదేవ్ బెస్ట్ లయన్స్ ఇమేజ్ బిల్డింగ్ అధ్యక్షుడు, మహదేవ్ వార్షిక జిల్లా అవార్డు, బెస్ట్ ఇన్నోవేటివ్ యాక్టివిటీస్ అవార్డు, బె స్ట్ లయన్స్ ఇమేజెస్ బిల్డింగ్ యాక్టివిటీ అవార్డు అధ్యక్షుడు అందుకోగా నల్లా శ్రీనివాస రావు అత్యుత్తమ సెక్రటరీ, వూర కిషోర్ బెస్ట్ అప్రిసియేషన్ ట్రెజరర్, నూకల వెంక టసాంబశివరావు జిల్లా క్యాబినేట్ ట్రెజరర్ మహదేవ్ ప్రశంసా పురస్కారం, సీహెచ్వీ వీ కుటుంబరాజు లయన్స్ సీనియర్ ప్రతినిధి మహదేవ్ ప్రశంసా పురస్కారం అం దుకున్నారు. లయన్స్ జిల్లా క్యాబినేట్ ముఖ్య ప్రతినిధులు కె.రామకష్ణ, చెన్నారెడ్డి. శ్రీనివాసరెడ్డి, చక్రధర్, క్లబ్ రీజినల్ చైర్మన్ బండి జ్యోతి, దినవహి ప్రసాద్ తదితరులు పాల్గొని అవార్డులు అందజేశారు.



అవార్డులతో ఉయ్యూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇస్మాయిల్ , సభ్యులు

ముగిసిన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-ఉయ్యూరు : మండల పరిషత్ కార్యాల యంలో మూడు రోజుల పాటు జరిగిన గ్రామపంచాయ తీ కార్యదర్శులు, సర్పంచ్లకు రిఫ్రెషర్ శిక్షణ తరగతులు శనివారం ముగిసాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు ఎలా వినియోగించాలి, గ్రామాల్లో పారిశుధ్యం, త్రాగునీటి సరఫ రాపై అధికారులు వివరించారు. చెత్త నుండిసంపద తయారీ ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరులు తదితర అంశాలపై ఏఓ శకుంతల, ఈఓపీఆర్డీ ఏ. కిరణ్మయి, సెక్రటరీ లక్ష్మణ రావు వివరించారు. సర్పంచ్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



సర్పంచ్ లు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

శిలాఫలకం తొలగింపుపై నిరసన



అవనిగడ్డలో...



మొవ్వలో...

ప్రజాశక్తి-అవనిగడ్డ : విజయవాడ పిడబ్ల్యుడి గ్రౌండ్‌లో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద శిలాఫలకంపై ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేరును తొలగించడం పట్ల వైసిపి నాయకులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. శుక్రవారం అవనిగడ్డ లోని సీతయ్యలంక వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలదండలు వేసి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి అపకారం చేసేందుకే ప్రయత్నం చేశారని, అయితే అది సాధ్యం కాక జగన్ పేరును తొలగించాలని, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ చర్యకు పాల్పడ్డ దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పులిగడ్డ విచ్చే శ్వరరావు, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ** : మొవ్వ మండలం మొవ్వ గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. విజయవాడ గ్రౌండ్ లోని సామాజిక న్యాయ మహా శిల్పం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన దాడిని ఖండిస్తూ, ధ్వంసం చేసిన వ్యక్తులను వెంటనే పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. మొవ్వ సెంటర్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి



హారికదేవి (ఫైల్)

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై కెసిపి ఫ్లైఓవర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమా దంలో గుడ్లవ ల్లేరు మండలంలోని కూరాడ గ్రామానికి చెందిన జి హారిక దేవి (22) మృతి చెందింది. శుక్రవారం సాయంత్రం విజయ వాడ నుండి హారిక బైక్‌పై వస్తూ ముందు వెళ్తున్న టీవీఎస్ మోపెడ్ ను వేగంగా ఢీకొట్టారు. దీంతో బైక్‌పై కూర్చున్న యువతికి ఫ్లై ఓవర్ గోడ తగలడంతో తీవ్ర గాయాల య్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. టివిఎస్ మోపెడ్ నడుపుతున్న వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. హారికదేవి గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో మూడో సంవత్సరం బీటెక్ చదువుతోంది. ఈ ఘటనతో కూరాడ గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని పులిగడ్డ శివారులో పేకాట నిర్వహిస్తున్న శిబిరంపై అవనిగడ్డ ఎస్సై కే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా దాడి జరిగి పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఆ ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో హుటాహుటిన ఆ శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ 7080 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. ఈ మేరకు పేకాట ఆడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుడివాడ రూరల్ సిఐగా సోమేశ్వరరావు బాధ్యతల స్వీకారం



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడివాడ రూరల్ సీఐగా ఎస్ ఎల్ ఆర్ సోమేశ్వరరావు శనివారం బాధ్యత చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు గుడ్లవల్లేరు ఎస్ఐ ఈ సత్య నారాయణ, ఏఎస్ఐలు సారధి బాబు, మెండు సాంబశి వరావు, సిబ్బంది అభినందనలతో స్వాగతం పలికారు.

కొండాలమ్మను దర్శించుకున్న సిఐ : మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న కొండా లమ్మ అమ్మవారిని గుడివాడ రూరల్ సీఐ సోమేశ్వరరావు దర్శించుకున్నారు. సోమేశ్వరరావు కుటుంబ సభ్యులతో శనివారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు అమ్మవారి శేష వస్త్రం, చిత్రపటంతో వారిని సత్కరించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ మచిలీపట్నం మండలంలోని కోన, పాతేరు గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో గ్రామంలో గల ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయం సాగు చేసుకోవడానికి పంట కాలువ నీరు సక్రమంగా రావటం లేదని,గత ప్రభుత్వ పాలకులు ఐదు ఏళ్ళు గా పట్టించుకోకపోవడం వల్ల పూడిక తీయకపోవడం వలన చివర వరకు ఉన్న భూముల వరకు నీరు అందడం లేదని తెలియజేశారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి సమస్యని కొద్ది రోజుల్లోనే పరిష్కరిస్తామని ఆమె తెలియజేసారు. 138 ఎకరాలలో ఉన్న రొయ్యల చెరువులను సాగు చేసుకోవడానికి ఇప్పటివరకు కరెంటు సప్లై లేదు రొయ్యల చెరువులకు కరెంటు సప్లై ఇప్పించమని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో పోలాటితిప్ప సర్పంచ్ మోకా రాజు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ పాల్గొన్నారు.



ఎఎస్‌ఐ శ్రమదానం

పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు నుండి నందిగామ రహదారి ముండ్ల పాడు గ్రామ సమీపంలో రహదారి మధ్యలో పెద్ద గంటలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు పడటమే కాకుండా కొంతమంది వాహనదారులు ఆ గుంటలో పడి పోయిన సంఘటనలు జరిగాయి. విషయం తెలుసుకున్న స్థానిక పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ శంకర్, ఆధ్వర్యంలో శనివారం శ్రమదానం నిర్వహించారు. దాదాపు ఐదు అడుగుల మేర వున్న గుంటను సిమెంట్, ఇసుక, కంకర రాళ్ళతో కాంక్రీటు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వాహనదారులు, రైతులు, ప్రజలు పోలీసు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులపై పిచ్చికుక్కల దాడి


గాయపడిన బాలుడు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం సోమవరం గ్రామంలో పిచ్చికుక్క దాడిలో ముగ్గురు గాయపడ్డారు. గ్రామాల్లో కొద్ది రోజులుగా పిచ్చికుక్క తిరుగుతుందని పంచాయతీ అధికారులకు తెలిపిన పట్టించుకోవటం లేదని గ్రామస్తులు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవరం గ్రామానికి చెందిన పి.సునీత, పి.రాజకుమార్, పి..వెంకట నరసమ్మలపై గ్రామంలోని పిచ్చికుక్క దాడి చేసింది. గోళ్ళమూడి పిహెచ్‌సిలో డాక్టర్ టి.రవి, సిబ్బంది పిచ్చికుక్కల దాడిలో గాయపడిన వారికి వ్యాక్సిన్ చేసి ప్రథమ చికిత్స చేశారు. అవసరమైతే వారి ఇంటికి ఆరోగ్య కార్యకర్తలు వచ్చి వైద్య సేవలందిస్తారని డాక్టర్ బాధితులకు తెలిపారు. గ్రామంలో పిచ్చికుక్కల లేకుండా చూడాలని మండల పరిషత్, రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించకుండా తగిన చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠానికి విచ్చేసిన కంచి పీఠం ప్రధానార్చకులు

ప్రజాశక్తి - భవానీపురం : శ్రీ దేవి కరుమారి అమ్మన్ శక్తి పీఠంలో కంచి కామకోటి పీఠం ప్రధాన అర్చకులు నటరాజన్ శాస్త్రి శ్రావణ శుక్రవారం సందర్భంగా శుక్ర, శనివారం శ్రీ కరుమారి అమ్మన్ శక్తి పీఠంలో స్వయంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠంను సందర్శించి శ్రీ సూక్తంతో శ్రీ చక్ర అర్చన చేశారు. కామాక్షి పీఠం తరుపున ఈ పీఠంలో పది రోజులు శ్రీ దశ మహా విద్య యాగాలు త్వరలో నిర్వహిస్తామని శ్రీ కరుమారి అమ్మన్ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ కరుణదాసు (స్వామి), తెలిపారు. ఈ కార్యక్రమంలో కంచి పీఠం ప్రధాన అర్చకులు నటరాజన్ శాస్త్రితో పాటుగా జ్ఞానేశ్వర్ రెడ్డి, పీఠం అర్చకులు దీక్షితులు, ప్రముఖ న్యాయవాది హేమంత్ పాల్గొన్నారు.

అనాథలకు నిత్యావసర సరుకుల వితరణ

ప్రజాశక్తి - తిరువూరు : స్థానిక సూర్య రెస్టారెంట్ సమీపంలో ఉన్న పరిపూర్ణ సేవ ట్రస్ట్ అనాథ బాలలకు దాత రైస్ బ్యాగ్, నిత్యావసర సరుకులు వితరణ చేశారు. తిరువూరు పట్టణ ప్రముఖ వ్యాపారి గుడిమెట్ల నాగ వెంకట రమేష్ బాబు జన్మదిన వేడుకలు శనివారం అనాథాశ్రమంలో జరిగాయి. వాస వి క్లబ్ సభ్యులు నేరెళ్ల సుబ్బా రావు రమణయ్య కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పరిపూర్ణ సేవా ట్రస్టు లోని అనాథ బాలలకు రైస్ బ్యాగ్, నిత్యవసర సరుకులు అందజేసిన రమేష్ బాబుకు సంస్థ డైరెక్టర్ సిరికొండ నాగేశ్వరరావు (అభి) అభినందనలు తెలిపారు. క్లబ్ సభ్యులు నేరెళ్ల సుబ్బారావు, వెంకట రమణయ్య విజ్ఞప్తి చేశారు.



పొట్టూరి స్వరాజ్యంను స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఏపి మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు, మాజీ కార్పొరేటర్ పొట్టూరి స్వరాజ్యంను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని మహిళా సమాఖ్య నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ అన్నారు. వన్‌టౌన్ పాతబస్తీ లెనిన్ భవనంలో పొట్టూరి స్వరాజ్యం ఏడవ వర్ధంతి కార్యక్రమం నగర మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళా సమాఖ్య నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ పొట్టూరి స్వరాజ్యం చిత్ర పఠానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం దుర్గాంబ మాట్లాడుతూ స్వరాజ్యం మహిళా సమాఖ్య ఉద్యమ నిర్మాణంలో ముఖ్య పాత్ర పోషించారని తెలిపారు. కొండ ప్రాంతాలకు మెట్లు ఏర్పాటు, కరెంటు సరఫరా, మంచినీటి పంపుల ఏర్పాటుకు విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షురాలు ఓర్సు భారతి, నగర నాయకులు, ఏఐటియుసి నాయకులు పాల్గొన్నారు.


పొట్టూరి స్వరాజ్యం వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎపి మహిళా సమాఖ్య నాయకులు

ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవాలు

నిరంతరం ఉపాధ్యాయ సమస్యలపై పోరాడే ఉపాధ్యాయ సంఘం నిబద్ధత క్రమశిక్షణ కలిగిన ఏకైక సంఘం యుటిఎఫ్ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం పలుచోట్ల స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. పలుచోట్ల యుటిఎఫ్ జెండా ఆవిష్కరించారు.


గంపలగూడెంలో


పెనుగంచిప్రోలులో



మైలవరంలో


విస్సన్నపేటలో

ప్రజాశక్తి - గంపలగూడెం : గంపలగూడెంలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక కార్యాలయంలో మండల కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణ జిల్లా మాజీ కార్యదర్శి సుందర్రావు పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, యుటిఎఫ్ శాఖను జిల్లాలో మరింత పటిష్టంగా ఉంచాలని సభ్యులను కోరారు. వందన కుమారి కె.రత్నకుమార్, పి.ఏడుకొండలు, కె.శ్రీనివాస్, కె.రాధాకృష్ణ, వసంతరావు తదితరులు ఉన్నారు.

పెనుగంచిప్రోలు : స్థానిక కె.వి.ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపాన మండల అధ్యక్షులు ఎమ్‌డి జిల్లాని అధ్యక్షతన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పతాకావిష్కరణ కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ కారణాలతో వైద్య సహాయం పొందుతూ ఉన్న వ్యక్తులకు రొట్టెల ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జిల్లేపల్లి సుధానంద్ మండల నాయకులు షేక్ ఫ్రైమర్, లింగయ్య, నాగేశ్వరావు, జానీ, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, సిహెచ్.మధు, విశ్రాంత ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విస్సన్నపేట : నిరంతరం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కొరకు చేస్తున్న పోరాటాలే యుటిఎఫ్ బలమని యూటీఎఫ్ స్వర్ణోత్సవాల వేడుకలో భాగంగా యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి బిసిహెచ్‌టతీ.సూర్య నారాయణ అన్నారు. శనివారం ఉదయం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో మండల నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జెండాను జిల్లా మాజీ గౌరవ అధ్యక్షులు దుగ్గి శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు కె.చైతన్య జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణారెడ్డి, బివి.రామారావు నాయకులు ఆకుల మురళి, వి.రవి రాజశేఖర్ పి.కస్తూరి లలిత, బాల భాస్కరరావు, విజయ్ సక్రు నాయక్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **మైలవరం :** స్థానిక సిపిఎం కార్యాలయం వద్ద యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ విద్యావేత్త ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణ్‌రావు ప్రచురించిన టెట్ అండ్ డిఎస్‌సి మెటీరియల్‌ను జిల్లా కార్యదర్శి గంగరాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వసంతరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి సుధాకర్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఎం తిరుపతిరావు, శ్రీలక్ష్మి, పాల్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.



దుర్గమ్మకు బంగారు హారం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి చింతలమడి, చల్లపల్లి, కష్ణా జిల్లాకు చెందిన ఎస్. వెంకట సుబ్బారావు మరియు కుటుంబ సభ్యులు శ్రీ అమ్మవారికి అలంకరణ నిమిత్తం కానుకగా 25 గ్రాములు బరువు గల బంగారు ఫాన్సీ హారాన్ని శనివారం ఆలయ కార్యనిర్వాహనాధికారి కె.ఎస్. రామా రావుని కలిసి దేవస్థానానికి అంద జేశారు. ఆలయ అధికారులు దాత కుటుం బానికి దర్శనం కల్పించగా, వేద పండితులు వేదాశీ ర్వచనం చేయ గా ఆలయ ఈవో ప్రసా దం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న న్యాయమూర్తి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ ఆలయానికి తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి అలిశెట్టి లక్ష్మీనారాయణ కుటుంబసభ్యులతో కలిసి శనివారం విచ్చేశారు. వీరికి ఆలయ ఎఇఒ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేదపం డితు లు వీరికి వేదాశీర్వచనం చేయగా ఎఇఒ ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి శ్రీ అమ్మవారి దర్శనార్థం శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ హరినాథ్ దంపతులు ఆలయానికి విచ్చేశారు. ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వీరు అమ్మవారి పంచహారతుల సేవలో పాల్గొన్నారు. అనంతరం వీరికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా, ఆలయ ఏఈఓ శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.


చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

విరాళాల సేకరణ



ప్రజాశక్తి - జగ్గయ్యపేట: కేరళలోని వయనాడ్ విపత్తు బాధితులను ఆదుకోవాలని కోరుతూ మండలం లోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సిపిఎం మండల, పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ కేరళలోని వరదల వలన ఎంతో ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని, ఇటువంటి సంఘటన జరగటం దురదష్టకరమని బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు స్పందించి విరాళాలు అందజేసి వరద బాధితులను ఆదుకోవాలని కోరారు. కేరళలో జరిగిన విపత్తుపై కేంద్రం చూస్తూ ఊరుకోవటం దుర్మార్గమని తక్షణమే కేంద్రం స్పందించి ఈ విపత్తును జాతీయ విపత్తుగా గుర్తించి కేరళను ఆదుకోవాలని కోరారు. ఈ విరాళాల్లో 4,580 రూపాయలు వసూలు అయినాయి. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోట కష్ణ, కాకనబోయిన లింగారావు, కాకనబయిన సుబ్బారావు, షేక్ మేరా సాహెబ్, షేక్ గౌస్ మయా, కోటా రవికుమార్, పుట్టం పుల్లారావు, షేక్ రేహమత్, షేక్ రిహాన్ తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి, వన్‌టౌన్ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌కేపీవీవీ హిందూహైస్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వీ. నారాయణరావు అన్నారు. కేబీఎన్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల ఆధ్వర్యంలో 'యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటాం' ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ వి.నారాయణరావు, అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులు ఈ విధమైన అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు డీ పవన్‌కుమార్, ఎన్ సాంబశివరావు, కల్మాబేగం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



ఆర్ట్, క్రాఫ్ట్, పిఇటి టీచర్లను రెగ్యులర్ చేయాలి



మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర అధ్యక్షులు సి హెచ్ఎన్ దేవేంద్రరావు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : సమగ్ర శిక్షలో కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ఆర్ట్, క్రాఫ్ట్ , పి ఈ టీ టీచర్లను రెగ్యులర్ చేయాలని సంఘ రాష్ట్ర అధ్యక్షులు సి హెచ్ ఎన్ .దేవేంద్ర రావు డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లా పార్ట్ టైమ్ ఇన్ స్ట్రక్టర్ల జిల్లా సమావేశం మచిలీపట్నంలోని యుటిఎఫ్ హాలులో జిల్లా అధ్యక్షురాలు గడిదేశి వనజ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన దేవేంద్రరావు మాట్లాడుతూ నేటి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు సమగ్ర శిక్షలో కాంట్రాక్టు విధానం పై పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని అప్పటి వరకు జీవో ఎంఎస్ నెంబర్ 40, 2021, జీవో ఎంఎస్ నెంబర్ ,5 ,2022 ప్రకారం మినిమం టైం స్కేల్ వేతనాలు చెల్లించాలన్నారు. అదేవిధంగా రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచి రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాడ్యుటీ చెల్లించాలాన్నారు. అన్ని పభుత్వ సంక్షేమ పథకాలను సమగ్ర శిక్ష ఉద్యోగులకు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వేతనాలతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలని, కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని, సాధారణ మరణానికి ప్రస్తుతం చెల్లిస్తున్న 2 లక్షలను , ఐదు లక్షలకు పెంచాలన్నారు. యాక్సిడెంట్ లో చనిపోయిన ఉద్యోగికి ప్రస్తుతం ఇస్తున్న 5 లక్షలు దాన్ని 10 లక్షలు చేయ్యాలన్నారు. ముఖ్యమంత్రి సూచించిన విధంగా పెత్తందారి తనం విడనాడి గ్రీవెన్స్ విధానములో అధికారులు సహుద్యోగ సమస్యలను సహద్భావ వాతావరం లో చర్చించి పరిష్కారం చేయాలని, అదే విధంగా సమగ్ర శిక్ష అధికారులు కూడా యునియన్ నాయకులతోనూ ఉద్యోగులతోనూ సహు ద్భావంతో పని చేయించుకుంటూ సహకరించడంలో కషి చేయాలన్నారు. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షులు శేషుబాబు , కోశాధికారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు .



మాట్లాడుతున్న డిఎల్‌పిఓ సంపత్ కుమారి

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి : డిఎల్‌పిఒ

ప్రజాశక్తి-ఉంగుటూరు : గ్రామాలు అభివద్ధి జరగాలంటే ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు కలిసి సమన్వయంతో కృషి చేయాలని గుడివాడ డిఎల్‌పిఒ జి. సంపత్ కుమారి అన్నారు. ప్రజాప్రతినిధులు, కార్యదర్శులకు గత మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణా తరగతులు శనివారం ముగింపు సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సంపత్ కుమారి మాట్లాడుతూ గ్రామాలలో డ్రైనేజీ సమస్య వల్ల దోమలు వద్ధి చెందుతాయని, అని వాటి వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతారన్నారు. కనుక అప్రమత్తంగా ఉండాలని అని సూచించారు. మంచి నీరు ఏ విధమైన కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే విధంగా గ్రామాలలో ప్రతి చిల్లర దుకాణంలో ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలని, లేదంటే ప్లాస్టిక్ వ్యర్థాలతో కలుషితం రెంటింపు అవుతుందవుతున్నారు. దీనివల్ల ప్రజారోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతాయి అని వీటి పట్ల అవగాహన తో ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపిడి ఓ కార్యాలయ సూపరింటెండెంట్ నిమ్మగడ్డ బసవయ్య, ఎం పి పి వడ్లమూడి సరోజిని,ఇఓపిఆర్ డి ఎం ఎ భాషా , పంచాయతీ సర్పంచ్ లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



మెరిట్ విద్యార్థుల తల్లిదండ్రులకు పురస్కారాలు అందిస్తున్న విశాఖ బ్యాంక్ డైరెక్టర్లు

మెరిట్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత

ప్రజాశక్తి-గన్నవరం : ఈ ఏడాది మెరిట్ విద్యార్థులకు రూ. 2.36 కోట్ల రూపాయలు ప్రతిభా పురస్కారాలుగా అందజేశామని ది.విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ డైరెక్టర్ జే.వి సత్య నారాయణమూర్తి తెలిపారు. శనివారం గన్నవరం శ్రీనగర్ కాలనీలోని ది.విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ లో మెరిట్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు పంపిణీ చేశారు. దీనికి బ్యాంకు సెక్రటరీ రమణ అధ్యక్షత వహించారు. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ బ్యాంకు సేవలతో పాటు బ్యాంకులోని సభ్యులకు కుటుంబాల్లోని మెరిట్ పిల్లలకు నగదు రివార్డులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. మెరిట్ లకు రూ.3వేలతో ప్రారంభించి 5 వేల వరకు నగదు రివార్డు పెంచమన్నారు. విదేశాల్లో ఉన్నత చదువులు చదువుకునే పిల్లలకు రూ.10.లక్షల నుండి 50 లక్షల వరకు రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతిభ గల పిల్లలకు 1శాతం రాయితీ ఇస్తామన్నారు. వైద్యానికి సహాయం చేస్తామన్నారు. బ్యాంకు డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు, బ్యాంక్ మేనేజర్ సిహెచ్ వి.రామశాస్త్రి, పాల్గొన్నారు. అనంతరం మెరిట్ విద్యార్థుల తల్లిదండ్రులకు నగదు పురస్కారాలు అందించారు.

ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు తొలగింపు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని కొత్తపేట గ్రామంలో జనసేన కార్యకర్తలు యువకులు చేపట్టే సేవా కార్యక్రమాలు ఆదర్శనీ యమని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ ప్రశంసించారు. శనివారం కొత్తపేట వెళ్లే ఆర్ అండ్ బి ప్రధాన రహదారికి కష్ణా నది కరకట్టకు మధ్య ఉన్న రోడ్డు మార్జిన్ లో దట్టంగా పిచ్చి మొక్కలు ముళ్ళకంపలు పెరిగిపోగా వాటిని తొలగించే పనులు చేపట్టారు. రోడ్డు మార్జిన్ లో జెసిబి తో వాటిని తొలగించి రోడ్డు మార్జిన్ లను బలోపేతం చేశారు. ఈ పనులను మండలి వెంకట్రామ్ పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపేటలో ఏ సమస్య ఉన్న ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ దష్టిలోకి తీసుకొని వస్తూ పరిష్కార దిశగా కషి చేస్తున్న జనసైనికులను అభినందించారు. ప్రస్తుతం చేపట్టిన రోడ్డు మార్జిన్ అభివద్ధి పనుల ద్వారా రోడ్డు మరింత వెడల్పు పెరుగుతుందన్నారు. కొత్తపేట జనసైనికులను సేవా మార్గంలో నడిపిస్తున్న కొత్తపేట తిప్పపాలెం ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను రామకోటి పురం వార్డు సభ్యులు అడపా ప్రభాకర్‌రావులను వెంకటరామ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



కొత్తపేటలో చేపట్టిన రోడ్డు మార్జిన్ అభివద్ధి పనులను పరిశీలిస్తున్న మండలి వెంకట్రామ్

కొనసాగుతున్న వరద ఉధృతి



పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద ప్రవహిస్తున్న వరదనీరు

ప్రజాశక్తి-అవనిగడ్డ : దివిసీమలోని కృష్ణా నదిలో వరద కొనసాగుతుంది. పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద శనివారం 9.5 అడుగుల ప్రవాహం సముద్రం వైపు వెళుతోంది. ఈ వరద వల్ల లంక భూముల్లోని పంటలకు ఎటువంటి నష్టము లేకపోయినప్పటికీ నదీ పరివాహక ప్రాంత గ్రామమైన పాత ఎడ్ల లంక చుట్టూ వరద నీరు ప్రవేశించడంతో ఆ గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. దీనితో ఆ గ్రామస్తులు బయటకు రావాలంటే పడవల మీద ప్రయాణం చేయవలసి వస్తోంది. దానిని శుక్రవారం ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అధికారులతో మాట్లాడి ఆ ఏర్పాట్లు చేయగా ఆ గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం కూడా కొనసాగుతుంది. మిగిలిన నది గర్భంలోని గ్రామాలకు పంట పొలాలకు ఎటువంటి ఇబ్బంది కలగడం లేదు. దీనితో అధికారులు ఆయా గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నప్పటికీ అప్రమత్తంగా ఉండవలసిందిగా అధికారులు మాత్రం హెచ్చరిస్తూనే ఉన్నారు.

చిన్నపాటి వర్షానికే నీరు నిల్వ

- వాహనదారుల ఇబ్బందులు

ప్రజాశక్తి-పమిడిముక్కల : కొద్దిపాటి వర్షానికి తాడంకి అండర్ బైపాస్ నీటమునిగి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి కింద ఏర్పాటు చేసిన అండర్‌పాస్ నిర్మాణంలో చిన్నపాటి వర్షానికే వర్షం నీరు నిలువ ఉండడంతో వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా మరివాడ, గోపువానిపాలెం, ఎల్లమ్మరు, గుడివాడ నుంచి వచ్చే ప్రయాణికులు వాహనదారులు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. వెంటనే నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



నీరు నిలబడిన దృశ్యం

వసతి గృహానికి నిత్యావసరాలు వితరణ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నంలోని స్తానిక భాస్కర పురంలో ఉన్న ఎవిలిన్ గర్ల్స్ హెూం కు సుమారు 10 వేల రూపాయల విలువ గల బియ్యం, నిత్యావసర సరుకులను మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వితరణ చేశారు. గత వారంలో గుడ్లవల్లేరు వాస్తవ్యులు వల్లూరు వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో భాగంగా హాస్టల్ కు విచ్చేసిన వల్లూరు సాయి శ్రీను, వారి మిత్ర బందం బాలికల అవసరాలు తెలుసుకుని వెంటనే స్పందించి తోటి మిత్రుల సహకారంతో సేకరించిన నిత్యావసర సరుకులు శనివారం హాస్టల్ బాలికలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మైత్రీ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు వరప్రసాద్, దాతలు వల్లూరు సాయి శ్రీను వారి మిత్రులు, సభ్యులు కనకరాజు,బి బి ఎస్ ప్రసాద్,రామకృష్ణ, రిలాక్స్ ప్రసాద్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



సరుకులు అందిస్తున్న దృశ్యం



ఉయ్యూరులో ప్రారంభానికి సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్

ప్రారంభానికి అన్నక్యాంటీన్ సిద్ధం

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరులో అన్న క్యాంటీన్ ప్రారంభానికి సిద్ధమవుతోంది. తెలుగుదేశం ప్రభుత్వం లో పాతవాటర్ ట్యాంక్ సమీపాన అన్నక్యాంటీన్ ఏర్పాటుచేసి రూ. 5 లకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందజేసి పేద, మధ్యతరగతి ప్రజల ఆకలి తీర్చారు. తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్నక్యాంటీన్కు మంగళం పలికి అక్కడ వార్డు సచివాలయాలు ఏర్పాటుచేశారు. ఇటీవల ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రాగానే అన్నాక్యా ంటీన్లను పున:ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకుంది. ఈనేపథ్యంలో పాత అన్నక్యాంటీన్ లో కొనసాగుతున్న వార్డు సచివాలయాలను నగరపంచాయతీ అధికారులు అక్కడను నుంచి మరొక చోటికి మార్చారు. అన్న క్యాంటీన్ భవనానికి మరమ్మతులకు రూ. 6 లక్షల 66 వేల రూపాయలు కేటాయించగా పనులు వేగవంతంగా జరుగుతున్నాయి..

నిత్యాన్నదానికి విరాళం అందజేత

ప్రజాశక్తి-గుడివాడ : పట్టణంలోని జగన్నధపురంలో శ్రీ భూనీలా సమేత శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానానికి నందివాడ మండలం నందివాడ గ్రామానికి చెందిన కొమ్మూరి వెంకయ్యనాయుడు ఆయన సతీమణి నాగమణి వారి తండ్రి జ్ఞాపకార్థం శ్రీ స్వామివారి దేవస్థానంలో శనివారం అన్నదానానికి రూ.10,116లు అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీ స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేసినట్లు దేవస్థానం ఈవో నటరాజన్ షణ్ముగం తెలిపారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్లలో వైసిపి షాక్ తగిలింది. జిల్లాలోనే మేజర్ పంచాయితి అయిన కంచికచర్ల సర్పంచ్ వేల్పుల సునీతతో పాటు ఆరుగురు వార్డు సభ్యులు వైసిపిని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చినప్పటి టిడిపిలో చేరాలని చూసినా కొన్ని కారణాల వల్ల ఆలస్యమైంది. గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్, పట్టణ వైసిపి అధ్యక్షుడు వేమా సురేష్ బాబు బలమైన నాయకుడు కావటంతో, కంచికచర్లలో వైసిపిని బలహీనపర్చేందుకు ఇప్పటి వరకు కూటమి నాయకత్వం వేచి చూసింది. ఎట్టకేలకు సర్పంచ్‌తో పాటు ఆరుగురు వార్డు సభ్యులను టిడిపిలోకి తీసుకునే ప్రయత్నం చేశారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో మండల టిడిపి అధ్యక్షులు కోగంటి బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్లమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురాం ఆధ్వర్యంలో చేరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నన్నపనేని లక్ష్మీనారాయణ నాయకులు గుత్తా రత్నం దమ్మాలపాటి రాజా, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి ఆల్లడి కోటేశ్వరరావు, మండల పార్టీ ఉపాధ్యక్షులు పంచాయతీ వార్డు మెంబర్ గుత్త ఓంకార్ గూడవల్లి గణేష్ టౌన్ పార్టీ అధ్యక్షులు వేమ వెంకట్రావు పాల్గొన్నారు.

లారీ ఢీ కొని ఆటో డ్రైవర్ మృతి

జగ్గయ్యపేట : లారీ ఢీకొని ఆటో డ్రైవర్ మృతిచెందిన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ అనుమాల శ్రీను జగ్గయ్యపేట నుండి స్వగ్రామం అగ్రహారం గ్రామానికి వెళ్తున్నాడు. పద్మావతి నగర్ సమీపంలో ఆటోలో నుంచి ఒక మహిళను దించుతుండగా ఆటో పక్కన నిలబడి ఉండగా అదే సమయంలో ఆటుగా లారీ రాంగ్ రూట్లో వచ్చి తగలడంతో గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని స్థానికులు జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ వెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. మృతునికి ఇద్దరు పిల్లలున్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

15న అన్నక్యాంటీన్ ప్రారంభం

జగ్గయ్యపేట : ఆగస్టు 15న పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తామని ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య తెలిపారు. శనివారం పట్టణంలోని విజయవాడ రోడ్‌లో గల కమల సెంటర్ వద్ద గతంలో నిర్వహించిన పాత అన్న క్యాంటీన్ భవనాన్ని స్థానిక కూటమి నాయకులతో కలిసి ఎంఎల్ఎ, మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు పరిశీలించారు. అన్న క్యాంటీన్‌ను 15న అన్నదానంతో ప్రారంభిస్తామని తెలిపారు.

ఎంఎల్ఎ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాస రావు పుట్టినరోజు సందర్భంగా తిరువూరులో పేదలకు అన్న దానం చేశారు. టిడిపి సీనియర్ నాయ కులు దుక్కిపాటి కాళీ వర ప్రసాద్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ అనంతరం బైపాస్ రోడ్ ఆంజనేయ స్వామి గుడిలో పేదలకు అన్నదానం చేశారు. టిడిపి పట్టణ కమిటీ అధ్యక్షుడు బొమ్మసాని ఉమా మహేష్ ఆధ్వర్యంలో కూడా అన్నదాన నిర్వహిం చారు. **విస్సన్నపేట :** విస్సన్నపేటలో శ్రీ లలితా సూపర్ మార్కెట్ ఆర్థిక సౌజన్యంతో లలితా రామకృష్ణ చేతుల మీదగా కేకు కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం పేద వృద్ధ మహిళలకు చీరల పంపిణీ చేశారు. లలిత సూపర్ బజార్ పార్టనర్స్ ఎల్ఎన్.మాచిన మురళి, ఎల్ఎన్.కోటపాటి రామకృష్ణ పాల్గొన్నారు. అంబేద్కర్ సెంటర్‌లో పేదలకు భోజన ప్యాకెట్లను కందుకూరి మోహన్, ముత్తంశెట్టి వంశీ రామ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. తెల్లదేవరపల్లిలో ఆర్.సుబ్బారావు, ఆర్.సురేష్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు.

కోర్టు భవనాల కాంప్లెక్స్‌లోకి జిల్లా కోర్టు తరలింపు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ 16వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, రామన్నపేట రోడ్డులో గల కోర్ట్ అద్దె భవనం నుండి నందిగామ కోర్టు భవన సముదాయం పాత ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు తరలించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు నండ్రు బాబు విద్యాసాగర్ అధ్యక్షతన ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా 16వ అదనపు ఇన్‌ఛార్జి జిల్లా జడ్జి శేషయ్య, సీనియర్ సివిల్ జడ్జ్ లక్ష్మీ రాజ్యం, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ రియాజ్, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ రేష్మా, బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎక్కిరాల హనుమంతరావు, ఉపాధ్యక్షులు కురగంటి కృష్ణంరాజు, లైబ్రరీ ఆనందం విజయ్, పీపీ రంగారావు, ఎపిపి దర్శి అర్జున తదితర న్యాయవాదులు పాల్గొన్నారు. దరిమిలా కార్యవర్గ సభ్యులు 16వ అదనపు జిల్లా జడ్జి శేషయ్య సన్మానించారు.

కొనసాగుతున్న శిక్షణా తరగతులు



ఇబ్రహీంపట్నంలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు

జగ్గయ్యపేట : మండలంలోని చిల్లకల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.రమేష్ బాబు ఆధ్వర్యంలో 3 రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శనివారం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జిఎస్ఎ), రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం కొనసాగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ (ఎల్ఇడి) – ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం 1994 సెక్షన్ 80, 81 సిసి ఛార్జీల చెల్లింపులు – ప్రభుత్వ విధానం, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పరిశీలన అంశాలపై శిక్షణ ఇచ్చారు. మండల పరిషత్ పరిపాలనాధికారి బి.రాజు, మండల ప్రజా పరిషత్ సీనియర్ అసిస్టెంట్ డి.కిశోర్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ ఆర్.రాణి, టైపిస్ట్ కుమారి జి.లక్ష్మీ తిరుపతమ్మ, మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ (ఎంఒటి) కె.వెంకట శ్రీనివాసరావు పాల్గొన్నారు. **వీరులపాడు :** శిక్షణలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి శివ పర్వతి, మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కోటేరు శ్రీలక్ష్మి జిల్లా పరిషత్ సభ్యురాలు ఆమర్లపూడి కీర్తి సౌజన్య పాల్గొన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పరచుకోవాలని కోరారు. **నందిగామ :** నందిగామ మండలంలో గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు రిఫ్రేషర్ ట్రైనింగ్ క్లాసులు స్పందన కరువైంది. సర్పంచులు, కార్యదర్శులు గైర్హాజరుతో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శులు గైర్హాజరుతో నందిగామ ఎంపిడిఒ కార్యదర్శులపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎంతో ఖర్చు పెట్టి ట్రైనింగ్ క్లాసులు నిర్వహిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. **పెనుగంచిప్రోలు :** గ్రామాలు పరి శుభ్రంగా ఉండాలంటే ఎస్‌డబ్ల్యుపిసి షడ్ నిర్వహణ చెయ్యాలని దీని వల్ల గ్రామం పరిశుభ్రంగా ఉండటమే కాక వర్మికం పోస్టు ఉత్పతి చేసి తద్వారా గ్రామ పంచాయతీ ఆదాయం పొందవచ్చని ఎస్‌డబ్ల్యుపిసి నిర్వహణ ఎస్‌హెచ్‌జి సభ్యుల భాగాస్వామ్యం, ప్రజల భాగసౌమ్యంతో జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమములో ఇఒ (పిఆర్‌అండ్‌ఆర్‌డి) ఎమ్‌డివి.ప్రసాద్, ఎన్‌జిఒ రామకృష్ణ, మండల పరిషత్ పరిపాలన అధికారి కె.సిద్దా రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి, కొనకంచి సర్పంచ్ గోనెల దేవి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, పాల్గొన్నారు. **తిరువూరు :** తిరువూరు మండలంలోని సర్పంచ్ లకు , పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల రిఫ్రెషర్ ట్రైనింగ్ లో భాగంగా రెండవ రోజు శనివారం లక్ష్మీపురం గ్రామ పం చాయతీని ఎపిడీఓ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సంద ర్శించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ షెడ్ ను పరిశీలించి వానపాముల ఎరువుల తయారీ విధానాన్ని, వాటి ఉపయోగాలను ఎంపిడిఓ సర్పంచ్ లకు, కార్యదర్శు లకు వివరించారు. **ఇబ్రహీంపట్నం:** నూతన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు శిక్షణ కార్యక్రమం శనివారం పూర్తి అయినట్లు ఇఒ పిఆర్‌డి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మనోజ్ తెలిపారు. మొదటి రోజు ఎంపిపి పాలడుగు జ్యోత్న్న చేతులు మీదుగా కార్యక్రమం ప్రారంభించారు. తదుపరి కోర్సు డైరెక్టర్ మనోజ్ సమావేశాలు ప్రారంభించారు. మొదటి రోజు పరిపాలన సమావేశం అనే అంశాల పైన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 2వ రోజు శు క్రవారం జిల్లా పంచాయతీ అధికారి వారు హాజరై మాట్లాడారు.

ఏడాకుల చెట్లతో ముప్పు..?



ప్రజాశక్తి - గంపలగూడెం : ప్రజలకు ఆక్సిజన్ అందిస్తే మంచి జరుగుతుందన్న పేరుతో ప్రభుత్వం మొక్కలు పంపిణీ అక్కడక్కడ పెంచే కార్యక్రమాన్ని చేపట్టింది. గత దశాబ్ద కాలంలో ప్రభుత్వాలు ఈ నిర్ణయాలు చేపట్టి ప్రజా ఆరోగ్యానికి మంచి చేసిందని చెప్పాలి. అయితే ఇదే బాటలో చెడుకూడా జరుగుతోందని కొందరి విశ్వాసం ప్రజా అవసరార్థం రహదారుల్లో ఈ చెట్లు పెద్ద మొత్తంలో పెరిగాయి. ఈ చెట్లతో నీడతోపాటు ఆక్సిజన్ పొంది మూగజీవాలతో పాటు ప్రజలకు కొంత ఆరోగ్యం చేకూరుతుందనడం అతిశయోక్తి కాదు. గానుగ, వేప, ఉసరి, తదితర మొక్కలతో పాటు ఏడాకుల అనే పేరు గల మొక్కలు ఏపుగా పెరిగి పబ్లిక్ ప్రదేశాల్లో ఎంతో అందాన్నిచ్చాయి. ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు మొక్కలు పెంచి, వాతావరణ కాలుష్యాన్ని నివారించడం లక్ష్యంగా పెట్టుకొని, ఎన్‌ఆర్‌ఇజిఎస్ ద్వారా ఈ మొక్కల పంపిణీ చేప ట్టింది. ఏడాకుల చెట్లతో ప్రజలకు నష్టం కలుగుతుం దంటూ కొన్ని చోట్ల తీసేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ చెట్లు ఏపుగా పెరిగి నీడతోపాటు వర్షానికి, తద్వారా వాతావరణ కాలుష్యం నివారణకు అధికంగా మంచి జరుగు తుం దని ప్రజలు చెబుతుండగా, ఇదే పరిస్థితిలో కొందరు ఈ చెట్లు ప్రతి ఏడాది నవంబర్ నుండి పూతా, కాపు నిచ్చే సందర్భంలో దుర్వాసన వెదజల్లి ఆరోగ్యానికి హానికరంగా మారే పరిస్థితిలు ఉన్నాయని ఆరోపిస్తున్నారు. తాజాగా గంపలగూడెంలో ఈ చెట్లను తొలగించేందుకు సిద్ధమైనట్లు కనిపిస్తోంది.

అంబేద్కర్ విగ్రహంపై తప్పడు ప్రచారం సరికాదు

ప్రజాశక్తి - నందిగామ : విజయవాడలో అంబేద్కర్ స్మృతివనంలో విగ్రహానికి ఉన్న జగన్ పేరును అర్ధరాత్రి ఎవరో ఆగంతకులు తొలగిస్తే వైసిపి నేతలు నానా రచ్చ చేస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ధ్వజమెత్తారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహంపై చిన్న గీత కూడా పడలేదని, కానీ అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేయటం సరికాదన్నారు.

మహిళకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - విసన్నపేట : విసన్నపేటలోని స్థానిక పుట్రెల రోడ్డులో సేకు కృష్ణ భార్యలక్ష్మి అనారోగ్యంగా ఉండడంతో విషయం తెలుసుకున్న టిడిపి నాయకుడు ముత్తంశెట్టి వంశీ ఆమెకు ఆర్థిక సాయం అందించారు. కూటమి పార్టీల నాయకులు కందుకూరి మోహన్ అడపా శ్రీనివాసరావు జగదీష్ పాతిబండ్ల సాయిరాం వెంకటేశ్వరరావు గోపి దాయక జీవన్ పాల్గొన్నారు.

మహిళలకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి, వన్‌టౌన్ : మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు జన్మదిన సేవావారోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీనన్నదళం రాష్ట్ర అధ్యక్షులు పోతిన వరప్రకాష్ ఆధ్వర్యంలో పేదలకు బియ్యం బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోతిన వర ప్రకాష్ మాట్లాడుతు తమ తల్లి పేరిట ఉన్న పోతిన నాగమణి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. పిళ్ళా వెంకట నారాయణ, నాగోతి పూర్ణచంద్రరావు, మోహన్ రామారావు పాల్గొన్నారు.

నరసింహారావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు జన్మదిన వేడుకలు వన్‌టౌన్‌లోని వించిపేటలో శనివారం ఘనంగా నిర్వహిం చారు. యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలను నరహరిశెట్టి నరసింహారావు కార్యకర్తల, అభిమానుల కోలాహలం నడుమ ముందుగా పుట్టినరోజు కేకును కోశారు. ఈ సందర్భంగా నరహరిశెట్టి నరసింహారావు మాట్లాడుతూ తన పుట్టినరోజుని కార్యకర్తలతో కలసి జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు, నగర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు అన్సారి, తదితరులు పాల్గొన్నారు.

సంపద సృష్టి కేంద్రాలు అందుబాటులోకి రావాలి

ప్రజాశక్తి - నందిగామ : అక్టోబర్ 2 గాంధీ జయంతి నాటికి నందిగామ మండలంలోని సంపద సృష్టి కేంద్రాలు అందుబాటులోకి రావాలని ఎంపిడిఒ విశ్వనాధ్, ఇన్చార్జి ఎంపీపీ ఆకుల హనుమంతరావు పేర్కొన్నారు. శనివారం నందిగామ మండలం లింగాలపాడులో లో సంపద సృష్టి కేంద్రాలను సర్పంచులు కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామాల్లో చెత్త సేకరించి తద్వారా గ్రామాల్లోని సంపాద సృష్టి కేంద్రాల్లో వానపాముల ద్వారా రైతులు రసాయనిక ఎరువులు వాడకుండా తమ పొలాల్లో ప్రకతిసేంద్రీయ వ్యవసాయానికి దోహదపడేలా సంపద సృష్టి కేంద్రాలు అందుబాటులోకి తేవాలని వారు తెలిపారు.

దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ రైతు బజార్‌లో ఖాళీగా ఉన్న 17 డ్వాక్రా షాపుల నిర్వహణకు అర్హులైన వారి నుండి దరఖాస్తులకు జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు నందిగామ రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ రవి కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ వెలువడిన వారం రోజుల వ్యవధిలో అర్హులైన డ్వాక్రా సంఘాల నుండి దరఖాస్తులు నందిగామ రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ కార్యాలయం, గొల్లపూడి మార్కెటింగ్ శాఖ కార్యాలయంకు అందజేయాలని కోరారు.

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట రైతు బజార్‌లో స్టాళ్ల కేటాయింపులకు డ్వాక్రా గ్రూపుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ట్టు జగ్గయ్యపేట రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. వారం రోజుల్లోపు డ్వాక్రా గ్రూపులు తమ దరఖాస్తులను జగ్గయ్యపేట రైతు బజార్ లో తనకు గాని, గొల్లపూడిలోని జిల్లా మార్కెటింగ్ అధికారికి గాని నేరుగా దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

ఎర్రకాల్వ సమస్య పరిష్కరించరూ!

జగ్గయ్యపేట : పట్టణంలో ఎర్రకాలవ సమస్య పరిష్కరించాలని హృదయ స్పందన సేవా సంస్థ అధ్యక్షుడు వేల్పుల మాణిక్యరావు కోరారు. వర్షాకాలం కావటంతో తోడు పిచ్చి చెట్లు పెరిగి, దోమలు ఉధృతమై, మురుగునీరు వెళ్ళక దుర్గంధంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో విష జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి ఎర్ర కాలవ సమస్యను పరిష్కరించాలని కోరారు.

'సెలవు దినాల్లో తరగతుల నిర్వహణపై చర్యలు తీసుకోవాలి'

వత్సవాయి : జగ్గయ్యపేట పట్టణంలో పలు ప్రైవేట్ పాఠశాలలు సెలవు దినాల్లో కూడా నడుపుతున్నారనే సమాచారం మేరకు, ప్రయివేటు ఉపాధ్యాయ అధ్యాపకుల ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు కరిసే మధు పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా నారాయణ, చైతన్య, తపోవన్ పలు ప్రైవేట్ పాఠశాలలు సెలవు దినాల్లో కూడా గేట్లుతెరచి అటు ఉపాధ్యాయులను, ఇటు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పిలిపించి క్లాసులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి నెలలో నాలుగు ఆదివారాలతో పాటు రెండో శనివారం కూడా కలుపుకొని ఐదు రోజులు, పండగ సెలవులు ప్రభుత్వ ఉత్తర్వులు ఉపాధ్యా యులకు, విద్యార్థులకు మానసిక, శారీరక వత్తిళ్లను తగ్గించుకొని కుటుంబంతో కలిసి ఉండేలా సెలవ దినాన్ని ప్రభుత్వం ప్రకటిం చిందన్నారు. ఇప్పటికైనా శ్రమ దోపిడి నుండి ప్రైవేటు ఉపాధ్యాయులు అధ్యాపకులు ఐక్యం గా కలిసి ముందుకు రావాలని పిటిఎల్‌ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు కరిసే మధు కోరారు.

డయాగ్నోస్టిక్ లేబొరేటరీ ప్రారంభం

జగ్గయ్యపేట : పట్టణంలోని విలియంపేటకు చెందిన బచ్చలకురి రవి వర్మ రంగు బజార్ మసీదు ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన అమరావతి డయాగ్నోస్టిక్ లేబొరేటరీ ల్యాబ్ టెస్ట్ సెంటర్‌ను శనివారం స్థానిక టిడిపి నేత లు కలిసి ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాత య్య, మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బా రావు, శ్రీరాం చిన్నబాబు ప్రారంభించారు.



ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు


నాగాయలంకలో...

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 50వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నాగాయలంకలోని యుటిఎఫ్ భవనం వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. యుటిఎఫ్ పతకాన్ని సీనియర్ నాయకులు ఎం వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బిజీ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయ హక్కులు బాధ్యతల కోసం నిరంతరం పోరాడుతూ ప్రభుత్వ పాఠశాలలు బలో పేతానికి కృషి చేస్తున్న ఏకైక సంఘం యుటిఎఫ్ అని తెలిపారు. రాష్ట్రంలో అతిపెద్ద సంఘంగా ఉంటూ ఉపాధ్యాయుల ఉన్నతికి పాటు పడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల అభివృద్ధికి సమాజ శ్రేయస్సుకు పాటుపడుతూ ముందుకు సాగుతున్న సంఘం యుటిఎఫ్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల శాఖ అధ్యక్షులు పి శ్రీనుబాబు, బి సాంబశివరావు, ఎస్ సురేష్ బాబు, యు శ్రీనివాస్, పి వెంకటేశ్వరరావు, బి హనుమాన్, ఎం శ్రీను, అనిల్, కెవి శేషారావు, డి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు ప్రజాశక్తి - గుడివాడ : యుటిఎఫ్ యూనియన్ స్థాపించి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో యుటిఎఫ్ పతాకాన్ని పూర్వ జిల్లా కార్యదర్శి కె.వి సుబ్బారావు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవాధ్యక్షులు నీలం ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఎందరో మహానుభావులు త్యాగఫలమే ఈనాటి ఉపాధ్యాయులు అనుభవిస్తున్న టువంటి సౌక ర్యాలు, త్యాగాలను గుర్తిస్తూ యుటిఎఫ్ ఆవిర్భావానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎల్.నరేంద్ర, సభ్యులు ఏవి వరలక్ష్మి, సిహెచ్ శ్రీనివాస్, వి.రాజారావు, తదితరులు పాల్గొన్నారు.


గుడివాడలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు


సర్పంచ్‌ను పరామర్శిస్తున్న బుద్ధ ప్రసాద్, వెంకటరామ్

సర్పంచ్‌కు పరామర్శ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ మండల పరిధిలోని అశ్వరావుపాలెం సర్పంచ్, విద్యానికేతన్ విద్యాసంస్థల అధినేత పి లంకమ్మ ప్రసాదును ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, ఆయన తనయుడు మండలి వెంకట్రామ్ శనివారం పరామర్శించారు. లంకమ ప్రసాద్ ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద కోలుకుంటున్నారు. విషయం తెలిసిన బుద్ధ ప్రసాద్ ఆయన తనయుడు ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండవీటి మస్తాన్‌రావు కూడా పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-చల్లపల్లి చల్లపల్లి మండలం లక్ష్మీపురం వీఆర్వో బెల్లంకొండ గోపీకృష్ణ స్థానిక సీయోను వృద్ధాశ్రమంలో కుమారులు సిద్ధార్థ, అభిరామ్‌ల పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమంలో శనివారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయ డీటీ కుమార్, వీఆర్వోలు గోపీకృష్ణ, వక్కలగడ్డ, యార్లగడ్డ వీఆర్వోలు నాంచారయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొని వృద్ధులకు అన్నదానం చేశారు.


వృద్ధులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

కేరళ వరద బాధితులకు విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఘంటసాల : కేరళ రాష్ట్రంలోని వయనాడ్లో వరదల వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాకా రామచంద్రరావు అన్నారు. మండల కేంద్రమైన ఘంటసాలలో ఏపీ కౌలు రైతు సంఘం కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల బ్యాంకు సెంటర్ నుంచి ప్రధాన సెంటర్ మీదగా విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజాప్రతి నిధులు, వివిధ షాపుల నిర్వాహకులు తమవంతు సహకారంగా రూ.12,001లు అందించినట్లు రామచంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు మిక్కిలినేని మధు, వేమూరి ప్రవీణ్. కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు, వ్యవసాయ కార్మికసంఘం. జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు. సహాయ కార్యదర్శి మేడంకి వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మ కరీముల్లా, బలే రమేష్, కల్లు గీతా కార్మిక సంఘం యూనియన్ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని మామిడి కోళ్ల గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ వీరమ్మ తల్లి దేవస్థానం పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం శనివారం జరిగింది. గ్రామ ప్రజల ఎన్నో ఏళ్ల చిరకాల కోరిక శ్రీ వీరమ్మ తల్లి దేవస్థానం పునర్నిర్మాణ జరుగుతున్నట్లు దేవస్థానం అభివృద్ధి కమిటీ తెలిపారు. దేవస్థాన నిర్మాణం కోసం ఈ గ్రామం నుండి ఇతర ప్రాంతాల్లో వ్యాపారాలు, ఉద్యోగాలు చేస్తున్న గ్రామస్తుల సహాయ సహకారాలతో ఈ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ పునర్నిర్మాణ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలతో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, కూటమి పార్టీ నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, కొడాలి రామరాజు, జగన్, మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.



గృహ నిర్మాణ లబ్ధిదారులకు బకాయిలు చెల్లించాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ నియోజక వర్గంలోని ఎన్టీఆర్ హౌసింగ్ స్కీం లబ్ధిదారుల బకాయిలు రూ.286 కోట్లు వెంటనే చెల్లించాలని సిపిఎం గుడివాడ పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ 2018-19 సంవత్సరంలో ఎన్టీఆర్ హౌసింగ్ స్కీమ్ కింద గుడివాడ నియోజకవర్గంలో 1037 మంది లబ్ధిదారులకు రూ.286 కోట్ల రూపాయలు బకాయి ఉండగా తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వాన్ని బకాయిలు ఇమ్మంటే ఇవ్వలేదన్నారు. కాబట్టి ఇప్పుడు తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చింది కాబట్టి 1032 మంది బకాయిలు రూ.286 కోట్ల చెల్లించాలని లబ్ధిదారులు తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు రేపాని కొండ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో చంద్రశేఖర్ ఆజాద్

ప్రజాశక్తి మోపిదేవి : మోపిదేవి గ్రామంలో ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తొలుత ఆజాద్ ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీ స్వామి వారిని దర్శించుకొనగా ఆలయ ప్రధాన అర్చకులు బుద్ధు పవన్ కుమార్ శర్మ, ముఖ్య అర్చక బుద్ధు సతీష్ శర్మ, పూజారులు ఆయనకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాయింట్ కమిషనర్ ఆజాద్ ని ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు.

పెదప్రోలులో అన్నదానం

ప్రజాశక్తి-మోపిదేవి : మండల పరిధిలోని పె దప్రోలులో శనివారం హనుమాన్ చాలీసా కార్యక్రమం జరిగింది. జనసేన పార్టీ నాయకులు పరుచూరి సాయిబాబు, పెదప్రోలు జనసేన పార్టీ గ్రామ కన్వీనర్ బాసు శ్రీనివాసరావు, క్రియా వాలంటీర్ మానుకొండ లీలాకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ యువ నాయకులు, ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ విచ్చేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ. కార్యక్రమంలో పెద్దలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి సీలింగ్ ఫ్యాన్లు అందజేత

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక మందపాడులో నిరాశ్రయుల ఆశ్రమంలో రెండు సీలింగ్ ఫ్యాన్లు శనివారం మాచర్ల రామకృష్ణ(ఆర్.కె)అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌కె మాట్లాడుతూ వృద్ధుల ఆశ్రమంలో గత కొన్ని రోజులుగా సీలింగ్ ఫ్యాన్లు కాలిపోవడంతో అక్కడ ఉన్న వృద్ధులు దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నారని తన మేనమామలు యేలిశెట్టిశేఖర్, యేలిశెట్టి రామోజీ జ్ఞాపకార్థం వృద్ధులకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో శివ, చరణ్, శ్యామ్ పాల్గొన్నారు.


ఫ్యాన్లు అందజేస్తున్న దృశ్యం



నిరసనలో పాల్గొన్న కాశీనాథ్, తదితరులు

రణదివె నగర్‌ను రక్షించాలని నిరసన

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ కృష్ణలంకలోని రణదివే నగర్ ప్రాంతంలో సిపిఎం ఆధ్వర్యంలో డ్రెయినేజీ నీటితో మునిగిపోతున్న ప్రాంతాన్ని రక్షించాలని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ కృష్ణానది వరద ప్రవాహానికి ఇళ్ళు మునగకుండా రిటైనింగ్‌వాల్ నిర్మించారన్నారు. కానీ రిటైనింగ్‌వాల్ ఆనుకుని ఉన్న రణదివే నగర్ ప్రాంతంలో అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణాన్ని విస్మరించారన్నారు. ఎగువ నుండి వస్తున్న కృష్ణానది వరదను ప్రకాశం బ్యారేజి గేట్లు ద్వారా వదిలివేయడం వలన పెద్ద ఎత్తున వరద నీరు ప్రవహిస్తుందని, ఆ నీటి ఊట రిటైనింగ్‌వాల్ డ్రెయినేజీలోకి కలుస్తుందని అన్నారు. దాదాపు 7 అడుగుల మేరకు డ్రెయినేజి నీరు రణదివేనగర్‌లో ఆరుచోట్ల పేరుకుపోయి చాలా ప్రమాదకరంగా ఉందన్నారు. ఇదే తరహాలో సమస్య తారకరామానగర్, భూపేష్‌గుప్తా నగర్ ప్రాంతాల్లో వస్తే డ్రెయిన్ ఏర్పాటు చేస్తే తప్ప ఈ సమస్య పరిష్కారం కాదని అనేకసార్లు నిరసన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. రిటైనింగ్‌వాల్ నిర్మాణం జరిగేపుడే అవుట్‌ఫాల్ డ్రైన్ నిర్మాణం చేపట్టి వుంటే ఈ సమస్య వచ్చేది కాదన్నారు. మురుగు నీటిలో ఉండకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. లేని పక్షంలో ప్రజలను కలుపుకుని మున్సిపల్ కార్పొరేషన్ వచ్చి సమస్య పరిష్కరించేవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పుప్పాల కృష్ణ, నగర కమిటీ సభ్యులు కోరాడ రమణ, స్థానిక నాయకులు తాడి రమణ, కొరవి శివాజీ, సరోజనమ్మ,పెంటి కోటి, అంగిడి లక్ష్మణ, రాజా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మార్పులపై ఉద్యోగ సంఘాలతో చర్చించాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో మార్పులపై ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించాలని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం గాంధీనగర్‌లోని ఓ హోటల్లో విలేకరుల సమావేశం జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థలో మార్పులు చేసే ఆలోచన చేస్తున్న నేపథ్యంలో సదరు ప్రక్రియలో భాగంగా ఉద్యోగ సంఘాలతో కూడా సమావేశం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు నాగ మోహన్, సురేష్ ,దామోదర్ రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

సంపద సృష్టి కేంద్రాలు అందుబాటులోకి రావాలి

ప్రజాశక్తి - నందిగామ : అక్టోబర్ 2 గాంధీ జయంతి నాటికి నందిగామ మండలంలోని సంపద సృష్టి కేంద్రాలు అందుబాటులోకి రావాలని ఎంపిడిఒ విశ్వనాధ్, ఇన్చార్జి ఎంపీపీ ఆకుల హనుమంతరావు పేర్కొన్నారు. శనివారం నందిగామ మండలం లింగాలపాడులో లో సంపద సృష్టి కేంద్రాలను సర్పంచులు కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామాల్లో చెత్త సేకరించి తద్వారా గ్రామాల్లోని సంపాద సృష్టి కేంద్రాల్లో వానపాముల ద్వారా రైతులు రసాయనిక ఎరువులు వాడకుండా తమ పొలాల్లో ప్రకతిసేంద్రీయ వ్యవసాయానికీ దోహదపడేలా సంపద సృష్టి కేంద్రాలు అందుబాటులోకి తేవాలని వారు తెలిపారు.

పవిత్ర సంగమంలో పెరుగుతున్న వరద

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : పవిత్ర సంగమంలో వరద పెరగడంతో నీటిమట్టం క్రమంగా పెరుగుతుంది. ఎగువ నుండి పెరుగుతున్న వరదతో అధికారులు అప్రమత్తమయ్యారు. వరదనీటి విడుదలతో కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతున్న నేపథ్యంలో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం ప్రాంతంలో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. ఇబ్రహీంపట్నం సిఐ చంద్రశేఖర్ నేతత్వంలో పవిత్ర సంగమం ప్రాంతంలో భద్రత కట్టుదిట్టం చేశారు. వరద పెరుగుదలతో పర్యాటకులను అధికారులు నది ఒడ్డుకు వెళ్ళకుండా ఎఎస్ఐ శ్రీనివాసరావు ముందస్తు చర్యలు తీసుకున్నారు.

వరద నీరు సముద్రం పాలు

'ప్రతి నీటి బొట్టును వడిసిపట్టు... నీటిని ఆదా చేయాలి' అంటూ ప్రభుత్వంలోని సిఎం దగ్గర నుంచి మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఊకదంపుడు ఉపన్యాసాలివ్వడమే తప్ప ఆచరణేమీ లేదు. ప్రతి ఏటా వర్షాకాలంలో ప్రకాశం బ్యారేజి నుంచి వందల టిఎంసిల వరద నీరు సముద్రం పాలవుతున్నా... ఆ నీటిని కాపాడుకోవడానికి ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు కాగితాలకు, ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి. ప్రభుత్వాల్లో లోపించిన చిత్తశుద్ధి కారణంగా ఇటు కృష్ణానది నీరు, అటు గోదావరి నీరు ప్రజలకు ఉపయోగపడకుండా, ప్రతి వర్షాకాలం సీజన్‌లో వందల టిఎంసిల నీరు వృథాగా సముద్రపాలవుతున్నాయి. దీని వల్ల ప్రకాశం బ్యారేజి పరిధిలోని ఐదారు జిల్లాల లక్షలాది మంది ప్రజలు, రైతులు తాగు, సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. లక్షలాది ఎకరాలకు సాగునీటి సమస్య ప్రతి ఏటా ఉత్పన్నమవుతూనే ఉంది. మరొక వైపు జిల్లాలోని ఎ.కొండూరు లాంటి మండలాల్లోని ప్రజలకు కృష్ణా జలాల రక్షిత మంచినీరు అందుబాటులో లేక కిడ్నీ వ్యాధితో పిట్టల్లా రాలిపోతున్నారు. ప్రతి ఏటా వందల టిఎంసిల వరద నీరు సముద్రపాలవుతుందని తెలిసినా... ఈ నీటిని నిల్వ చేసుకోవడానికి చెక్‌డ్యామ్‌లు, ఎత్తిపోతల పథకాలు అందుబాటులో ఉండి, నిరుపయోగంగా ఉన్నాయి. మరొక వైపు ప్రకాశం బ్యారేజి దిగువన రెండు బ్యారేజీల నిర్మాణం చేపట్టాలని ఆరేడు సంవత్సరాల నుంచి డిపిఆర్‌లు కాగితాలకే పరిమితం అయినా... ప్రభుత్వాల స్థాయిలో నేటికీ పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది.

62 టిఎంసిలు సముద్రపాలు...

ఈ ఖరీఫ్ సీజన్‌లోనే గత జులై, ఈ నెలలో కురిసిన వర్షాలు... రెండు సార్లు వచ్చిన కృష్ణానది వరదలకు 62 టిఎంసిల నీరు సముద్రపాలయిందని

వీక్షణం

స్వయంగా ప్రకాశం బ్యారేజి ఇరిగేషన్ అధికారులు తెలుపుతున్నారు. ప్రతి సంవత్సరం కృష్ణానదికి వచ్చే వరదల తీవ్రతను బట్టి... 250 నుంచి 300 టిఎంసిలు, మరీ ఉధృతంగా వస్తే 400 నుంచి ఐదారు వందల టిఎంసిల నీరు సముద్రపాలవుతూ ఉంటుందని అటు ఇరిగేషన్, ఇటు రైతు సంఘాల నేతలు వారి అనుభవాలను వివరిస్తున్నారు. ఒక్క టిఎంసి నీటితో 10 వేల ఎకరాల మాగాణి భూములకు, 15 వేల ఎకరాల మెట్ట పైర్లు పండించుకోవచ్చని ఇరిగేషన్, వ్యవసాయ అధికారులతో పాటు రైతు నాయకులు తెలుపుతున్నారు. ప్రకాశం బ్యారేజి పరిధిలోని ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఏలూరు జిల్లాల పరిధిలో సాగునీటి సమస్య కారణంగా వరి నాట్లు వేసిన వేలాది ఎకరాల్లో ఎండిపోతుండగా, లక్షలాది ఎకరాల్లోని వరి సాగుతో పాటు మెట్టపంటలకు ఇబ్బందిగా తయారయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నీటి నిల్వ వనరులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు...

వరద నీటిని నిల్వ చేసుకునేందుకు ప్రకాశం బ్యారేజి దిగువన చోడవరం దగ్గర, అలాగే మోపిదేవి మండలంలోని బండికోలలంక ఏరియాలో కృష్ణానదికి రెండు డ్యామ్‌లు ఏర్పాటు చేయాలని పూర్తి స్థాయిలో డిపిఆర్‌లు పూర్తి చేసి ఆరేడు సంవత్సరాలయింది. ఈ రెండు డ్యామ్‌లు పూర్తి చేసుకున్నట్లయితే సుమారు పది టిఎంసిల వరద నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంటుందని ఇరిగేషన్ శాఖ అధికారులు వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా నది నీటిని స్టోరేజ్ చేసుకునేందుకు కంచికచర్ల వద్ద ఆనకట్ట నిర్మించినట్లయితే...10 నుంచి14 టిఎంసిల నీటిని నిల్వ చేసుకోవచ్చునని ఎప్పటి నుంచో ఉన్న ప్రతిపాదన కాగితాలకే పరిమితం అవుతూ వస్తోంది. ఇదే కనుక పూర్తి అయితే అటు వ్యవసాయానికి, ఇటు 25 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలకు సైతం తాగునీరు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని ఆ ప్రాంత ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అలాగే గోదావరి జలాలను నిల్వ చేసుకొని వినియోగించుకునేందుకు కంచల- వేదాద్రి స్కీమ్, అలాగే 22 టిఎంసిల సామర్థ్యం కల్గిన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చుకోవడానికి నిధులను కేటాయించినట్లయితే వీటి పరిధిలోని ఐదారు జిల్లాల లక్షలాది ఎకరాలు సశ్యామలం అవడమేగాక, భూగర్భజలాలు పెంపొందించుకొని, వేలాది గ్రామాలకు మంచినీటి ఎద్దడిని నివారించవచ్చునని చెప్పవచ్చు. కానీ నేటి ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాల్సి ఉందని చెప్పక తప్పదు.

- రాజు

రాష్ట్ర తైక్వాండోలో జిల్లా క్రీడాకారులకు బహుమతులు

ఆగ్రాలో జరిగే జాతీయ పోటీలకు దామిని, నిహారిక ఎంపిక

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈ నెల 3, 4 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ఇతర జిల్లా క్రీడాకారులతో పోటీ పడి ఉమ్మడి కృష్ణా జిల్లా క్రీడాకారులు పలువురు వివిధ విభాగాల్లో పతకాలు సాధించినట్లు ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యదర్శి ఎం.అంకమ్మరావు పేర్కొన్నారు. శనివారం కోచింగ్ సెంటర్ వద్ద పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం అయన మాట్లాడుతూ అండర్ - 11 బాలుర వ్యక్తిగత విభాగంలో బి.రాజు కాంస్య పతకం, బాలికల విభాగంలో జి.యోగా శ్రీ మహాలక్ష్మి బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. పెయిర్ లో బి. రాజు, నిహారిక కాంస్య, గ్రూప్ బాలుర విభాగంలో బి.రాజు, టి.నిశాంత్, జి. మౌనిష్‌లు కాంస్య పతకం, గ్రూప్ బాలికల విభాగంలో జి.యోగ శ్రీ మహా లక్ష్మి, ఎం.నిహారిక, ఆర్.అక్షితలు బంగారు పతకం, 38 కేజీల విభాగంలో ఎం.నిహారిక బంగారు, 41 కేజీల విభాగంలో లివోసొనాల్ కాంస్య, 35 కేజీల విభాగంలో టి.సాయి దుర్గ సాత్విక కాంస్య పతకాలు గెలిచినట్లు పేర్కొన్నారు. అండర్ 14 విభాగంలో వ్యక్తిగత బాలుర విభాగంలో ఆర్. అఖిలేష్ కాంస్య, వ్యక్తిగత బాలికల విభాగంలో బి.ఉష శ్రీ వెండి పతకాలు సాధించినట్లు తెలిపారు. గ్రూప్ బాలుర విభాగంలో యూ. గణేష్ కుమార్, ఆర్. అఖిలేష్, మదన్ సాయిలు వెండి, గ్రూప్ బాలికల విభాగంలో ఎం. రిట్సికా, బి. ఉషాశ్రీ, కె.దామిని వెండి



విజేతలతో కోచ్‌లు

పతకాలు సాధించినట్లు వివరించారు. 55 కేజీల విభాగంలో కె.దామిని బంగారు, 29 కేజీల విభాగంలో బి.ఉషశ్రీ వెండి, 44 కేజీల విభాగంలో కాంస్య, 61 కేజీల విభాగంలో జె.అఖిల్ వెండి పతకాలు గెలిచినట్లు తెలిపారు. వీరిలో 55 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన కలతోటి దామిని, అండర్ - 11విభాగంలో నిహారిక లు ఉత్తరప్రదేశ్ రాష్ట్రము ఆగ్రాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు పేర్కొన్నారు. క్రీడాకారులకు పి.గౌరీ శంకర్, ఎం.బాల చంద్ర, పి.విక్టర్ ఆదిత్య, కె.కృష్ణ వంశీ, ఎస్. రోహిత్, బి.దినేష్‌లు కోచ్‌లుగా పని చేసినట్లు పేర్కొన్నారు.



సినీ హీరో మహేష్ బాబు జన్మదిన వేడుకలు

విజయవాడ : పోలంపల్లి గ్రామానికి చెందిన మహేష్ బాబు అభిమానులు శుక్రవారం రాత్రి అన్నదానం చేసి, తమ హీరో చేసిన 1000కి పైగా గుండె ఆపరేషన్‌లు గురించి, సేవా కార్యక్రమాల గురించి గుర్తు చేసి, మూడు సంవత్సరాలుగా ఈ కార్యక్రమం సొంత ఖర్చులతో నిర్వహిస్తున్నామని, ప్రతి సంవత్సరం ఇలానే నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఆశ్రమం నిర్వహిస్తున్న పెద్దలకు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాడుగుల రామారావు, దారెల్లి క్రాంతికుమార్, మాడుగుల వంశీ, వంకాయలపాటి జగదీశ్ మాడుగుల అనిల్, పులిపాటి మహేష్, ఎస్‌కె.నాగుల్ మీరా, మాగం శివ, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్

ప్రజాశక్తి - మైలవరం : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కొత్త ప్రభుత్వం కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు రెండో రోజు స్థానిక పెన్షనర్స్ భవనంలో శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రసన్నకుమార్ మాట్లాడుతూ విద్యా రంగంలోని సమస్యలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని అన్నారు. అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే కృషి చేయాలి అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని అర్హులైన ప్రతి ఒక్క విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి సిహెచ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులకు కాస్మోటిక్



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

ఛార్జీలు పెంచాలని పెండింగ్‌లో ఉన్న నాడు నేడు పనులు పూర్తి చేయాలని అన్నారు. ప్రతి మండల కేంద్రంలో ఒక ప్రభుత్వ జూనియర్, నియోజకవర్గంలో డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి.గోపి నాయక్, సిఐటియు మండల కార్యదర్శి సుధాకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు మహేష్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి శరన్, శశి, భావన జిల్లాలోని అన్ని మండలాల ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

విషం జ్వరంతో మహిళ మృతి

ప్రజాశక్తి - వీరులపాడు : మండలంలోని జుజ్జూరు గ్రామంలో విష జ్వరంతో మహిళ శనివారం మృతిచెందింది. వివరాల ప్రకారం... జుజ్జూరుకు చెందిన షేక్ ఆశ (25)కు జ్వరం రావడంతో కంచికచర్లలో ఓ ప్రయివేటు ఆస్పత్రిలో వైద్యమందించా రు. పరిస్థితి విషమించడంతో విజయవాడలోని ఓ



ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా విషజ్వరమని వైద్యులు తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె శనివారం మృతిచెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలున్నారు.